

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 3 | సంచిక : 287 | సోమవారం 13-10-2025 | పేజీలు : 12 | వెల-3



# గూగుల్-రైడెన్‌తో రేపు ఒప్పందం

**2029 నాటికి విశాఖలో డేటా సెంటర్ పూర్తి**
**దేశంలోనే అతిపెద్ద డేటా హబ్‌గా విశాఖ**
**విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం**
**ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నాం**
**గత తప్పిదాలు పునరావృతం కానివ్వను**



# నకిలీ మద్యంపై సిట్

**త్వరలోనే కుట్ర బయటపడుతుంది: సీఎం**
**ఇది సాధారణంగా జరిగిన నేరం కాదు**
**నకిలీ గుట్టు తేల్చేలా ఎక్సైజ్ సురక్ష యాప్**
**ఈనెల 16 నుంచి అందుబాటులోకి**
**ప్రజారోగ్యమే నాకు ముఖ్యం**
**యాచకుల మరణాలనూ 'నకిలీ' ఖాతాలో వేస్తున్నారు**
**తప్పుడు ప్రచారం సహించం**
**సీఎం చంద్రబాబు హెచ్చరిక**
**'సిట్'లో ఏలూరు ఐజీ అశోక్,**
**ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్**

2లో

నకిలీ మద్యం వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇది సాధారణంగా జరిగిన నేరం కాదని... భారీ కుట్ర ఉందని తెలిపారు. కుట్రదారులెవరో త్వరలోనే బయటపడుతుందని అన్నారు. ఇందులో దిగ్భ్రాంతికరమైన అంశాలు వెలుగు చూసే అవకాశముందని తెలిపారు.

ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు 'ఎక్సైజ్ సురక్ష' పేరుతో కొత్త యాప్‌ను ఆవిష్కరించారు. మద్యం సీసాపై ఉన్న బార్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ సీసా ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు అన్ని వివరాలు తెలుస్తాయని... కోడ్ స్కాన్ కాకపోతే అది నకిలీగా నిర్ధారణ అవుతుందని వివరించారు. ఈ యాప్ పనిచేసే తీరుపై ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. మరిన్ని వివరాలు చంద్రబాబు మాటల్లోనే...

**గత ప్రభుత్వ పాపం...**

నకిలీ మద్యం అనేది కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన సమస్య.

## ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం!



**2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖను అభివృద్ధి చేస్తాం**
**ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం**
**హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళ్లు పడితే విశాఖకు పదేళ్ల సమయం చాలు**
**భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి!**
**డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ప్రారంభ%శీ% అనంతర కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్**



# ఎస్సారెస్పీ ఫేజ్ 2కు దామోదర్‌రెడ్డి పేరు

**24 గంటల్లో జీవో విడుదల చేస్తాం**
**ఆర్డీఆర్‌కు ఇచ్చే ఘనమైన నివాళి ఇదే**
**దామన్న వల్లే నల్లగొండకు గోదావరి జలాలు**
**ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది**
**దామోదర్‌రెడ్డి సంతాప సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



## యువత.. పాతికేళ్ల భవిత కోరుతున్నారు

**ఉచితాలు, పథకాలు కాదు!**
**పవన్ కల్యాణ్ సంచలన ట్వీట్**



## డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

# వివేక్ వర్సస్ అడ్లూరి



**ముగిసిన వివాదం మళ్లీ తెరపైకి!**
**నాపై కావాలనే మంత్రి అడ్లూరి విమర్శలు ఆయన్ను రాజకీయాల్లో ప్రోత్సహించింది కాకానే అడ్లూరితో నాకు విభేదాల్లేవు: మంత్రి వివేక్ వివేక్ పార్టీ నేతల సమక్షంలో మాట్లాడాల్సింది ఆయన కుమారుడిని గెలిపించింది మేం కాదా? ఇక అధిష్ఠానమే చూసుకుంటుంది: అడ్లూరి**

మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్ వెంకటస్వామి మధ్య సమసిపోయిందనుకున్న వివాదం మళ్లీ రాజుకుంది. జూబ్లీహిల్స్‌లో ప్రెస్‌మీట్ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై అడ్లూరి చేసిన వ్యాఖ్యలను వివేక్ తాజాగా



## రిజర్వేషన్ల సాధనకు బీసీ జేఏసీ

**రాష్ట్రంలో ఏకమైన బీసీ సంఘాలు జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్**

# గూగుల్-రైడెన్‌తో రేపు ఒప్పందం

గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో మంగళవారం ఒప్పందం చేసుకునేందుకు ఢిల్లీ వెళుతున్నానని, ఇది తన రాజకీయ జీవితంలో అపూర్వ ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2029 నాటికి విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి చేస్తారని చెప్పారు. ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెడుతున్నామని, ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌గా మారబోతోందని అన్నారు. ఓ వైపు డేటా సెంటర్ మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విశాఖపట్నం రూపురేఖలు మారబోతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తుంటే వాటిని అడ్డుకునేందుకు కొందరు బెదిరింపులకు దిగడం ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. నవంబరులో జరిగే పెట్టుబడుల సదస్సుకు ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

**పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం** పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం కల్పిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో కొత్త తరాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని,

యువతరానికి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు పార్టీ కార్యాలయంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. 15 ఏళ్లు సీఎంగా ఉండటం గొప్ప విశేషమని ప్రధాని తనకు ఫోన్ చేసి చెప్పినప్పుడు, మీరు 25 ఏళ్లు ప్రభుత్వాధినేతగా (ముఖ్యమంత్రి-ప్రధాని) ఉండటం ఇంకా గొప్ప విశేషమని మోదీకి చెప్పానని అన్నారు.

రాష్ట్రంలో వైకుంఠపాళి విధానం వల్ల కొన్నిసార్లు అధికారానికి దూరమయ్యానని చెప్పారు. తాను అధికారానికి దూరంగా ఉండటంలో ప్రజల తప్పు లేదని, తానే కొన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం బాగుండాలనే ఉద్దేశంతో పరిపాలన చేశానే తప్ప మరేదీ ఆలోచించలేదని, ఇప్పుడు పరిపాలనతో పాటు రాజకీయం కూడా చేస్తున్నానని అన్నారు. గత తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నానని తెలిపారు.

# నకిలీ మద్యంపై సిట్

2019-24 మధ్య నకిలీ మద్యంప్రారంభమైంది. దాంతోపాటు గంజాయి, డ్రగ్స్ కూడా విచ్చలవిడిగా విస్తరించాయి. వాటిపై ఈ ప్రభుత్వం ప్రక్షాళన ప్రారంభించింది. 'ఈగల్' ద్వారా గంజాయిని నియంత్రించాం. వైసీపీ ప్రభుత్వంలో డిస్టిలరీలను బలవంతంగా లాక్కున్నారు. నచ్చిన బ్రాండ్లు అమ్ముకున్నారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు లేకుండా చేశారు. వాటన్నిటిపై మేం వచ్చాక విచారణ ప్రారంభించాం. అయినప్పటికీ భయం లేకుండా నకిలీ మద్యమంటూ బరితెగించారంటే దీని వెనుక కుట్ర ఉందని అర్థమవుతోంది. నేరస్థులు ఎవరైనా సరే, ఎలాంటి ముసుగు కప్పుకొన్నా, ముసుగు తొలగించి కొరడా ఝులిపిస్తాం!

**ఈ పరిస్థితి ఇదే తొలిసారి...** నేను సీఎంగా 15ఏళ్లు పూర్తిచేసుకున్నా. 15ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నా. మొత్తం టీడీపీ ప్రభుత్వం 22ఏళ్లు అధికారంలో ఉంది. కానీ, ఎప్పుడూ చూడని వింత ధోరణి ఇప్పుడు కనిపిస్తోంది. 1995 నుంచి ఇప్పటిదాకా నేను సీఎంగా ఉన్నప్పుడు ఎన్నడూ నకిలీ మద్యం చూడలేదు. దాని గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. ఇప్పుడు వైసీపీ వల్లే ఆ పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వంలో నాణ్యత లేకపోవడం, ధరలు పెంచడం వల్ల పక్క రాష్ట్రాల మద్యం రాష్ట్రంలోకి వచ్చింది. మేం ఇవన్నీ నియంత్రించాం. ములకలచెరువు ఘటనలో 16 మందిని, ఇబ్రహీంపట్నం ఘటనలో ఏడుగురిని అరెస్టు చేశాం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు మా పార్టీకి చెందినా చర్యలు తీసుకున్నాం. ములకలచెరువు నకిలీ మద్యం బయటపెట్టిందే మా ప్రభుత్వం. దాని లోతుల్లోకి వెళ్లేకొద్దీ షాకింగ్ విషయాలు తెలుస్తున్నాయి. త్వరలో అవి బయటపెడతాం.

**వీరితోనే సిట్...** నకిలీ మద్యంపై విచారణకు సిట్‌ను నియమిస్తున్నాం. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి, టెక్నికల్ ఎస్పీ మల్లికా గార్గ్, ఎక్సైజ్‌లో ఒక అధికారితో సిట్ ఏర్పాటుచేస్తున్నాం. ఆఫ్రికాలో నకిలీ మద్యం తయారీ నేర్చుకుని, దానిని ఏపీలో అమలుచేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇకపై ప్రతి మద్యం షాపులో ప్రతి సీసాను స్కాన్ చేసిన తర్వాతే అమ్మాలి. ఈనెల 16 నుంచి అన్ని మద్యం షాపుల్లో సురక్ష యాప్ అమల్లోకి వస్తుంది. వినియోగదారులు కూడా కొనుగోలు చేసిన సీసాలను స్కాన్ చేసి పరిశీలించాలి. ఏవైనా ఫిర్యాదులుంటే 14405 నంబరుకు కాల్ చేసి చెప్పవచ్చు. షాపులో స్కాన్ చేసిన తర్వాత దానిని బెల్టులకు పంపినా తెలిసిపోతుంది. ఎక్కడైనా బెల్టుల్లో అమ్మితే బెల్టు తీస్తాం!

**కుట్రలో భాగంగా శవ రాజకీయాలు** కుట్రలో భాగంగా శవ రాజకీయాలు మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో 30వేల మంది నాసిరకం మద్య వల్ల తీవ్ర వ్యాధులకు గురయ్యారు. జంగారెడ్డిగూడెంలో నకిలీ మద్యం తాగి 27 మంది చనిపోతే చిన్న విచారణజరపలేదు. చివరికి మృతులకు పోస్టుమార్టం కూడా చేయించలేదు. ఇప్పుడు రాష్ట్రంలో ఏ కారణంతో చనిపోయినా నకిలీ మద్యం వల్లే అని ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో భయం, అలజడి సృష్టించి, ప్రభుత్వం విఫలమైందనే ముద్ర వేయాలనే కుట్ర చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ఎవరితో లాలూచీ పడదు. నకిలీ మద్యం పేరుతో కుట్రలు చేయాలని చూస్తే సాగవు. ఫేక్ వార్తలు వ్యాప్తి చేస్తే సీరియస్ చర్యలుంటాయి. ఆ వార్తల సోర్స్‌పైనా విచారణ చేస్తాం. నిజాలు చెబితే అభినందిస్తాం.

**అదే మీకూ మాకూ తేడా** వైసీపీ హయాంలో నకిలీ మద్యంతో 27 మంది చనిపోయినా పట్టించుకోలేదు. అదే మా ప్రభుత్వంలో ఏలూరులో ఒకరు చనిపోతే వెంటనే పరీక్షలు చేయించాం. అతను ఇతర కారణాల వల్ల చనిపోయారని తేలినప్పటికీ అది నకిలీ మద్యం వల్లే అని ప్రచారం చేసి పైశాచికానందం పొందుతున్నారు. యాచకుల మరణాలనూ నకిలీ మద్యం ఖాతాలో వేసి శవ రాజకీయం చేస్తున్నారు. తప్పుచేసిన వారిలో రాజకీయ నాయకులు, అధికారులు, ఇంకా ఎవరున్నా వదిలిపెట్టం. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని చూసేవారిని కూడా వదలం.

**నేరాల్లో ఇరుక్కున్నవారికే అలవాటు** నేరాల్లో ఇరుక్కుపోయినవారికే ఇలాంటి నకిలీ మద్యం నేరాలు చేయడం అలవాటుగా ఉంటుంది. వారు నేరం చేసి ఆ నెపం ఎదుటివారిపై మోపాలని చూస్తారు. గతంలో వివేకాహత్య కేసు ఎలా చేశారో చూశాం. ఇప్పుడు ఎక్సైజ్ మంత్రిని, కార్యదర్శిని విచారించాలని పిచ్చి డిమాండ్లు చేస్తున్నారు. నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు కోరడం... కేసుల డైవర్షన్ కోసం కూడా కావొచ్చు. ఎక్సైజ్ అధికారులు జాగ్రత్తగా ఉండాలి. తప్పు చేస్తే కఠిన చర్యలుంటాయి. ఇకపై మీరు తప్పు చేయలేని విధానం తీసుకొస్తాం.

# ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం!



**విశాఖపట్నం: చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దుతామని, 2047 నాటికి విశాఖ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన అనంతరం రిషికొండలోని ఏ1 గ్రాండ్ కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఇక్కడున్న ఐటీ ప్రొఫెషనల్స్ కు, సీఈవోలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నిజాయతీగా చెప్పాలంటే.. 1990ల్లో లో పలు ఐటీ సంస్థలు హైదరాబాద్ కు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైబర్ టవర్స్ ను నిర్మించారు. దీనివల్ల అనేక సంస్థలు హైదరాబాద్ కు వచ్చాయి. హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళ్లు పైనే పట్టింది. విశాఖకు పదేళ్లకు మించి పట్టదు. అది మా కమిట్ మెంట్. కంపెనీలు తీసుకురావడం వెనుక ఉన్న శ్రమను ప్రజలు గుర్తించాలి. రాజు గారిని మొదటిసారిగా 2017లో కాలిఫోర్నియాలో కలిశాను. ఆ సమయంలోనే మొదలైంది ఈ ప్రయాణం. ఆయనను విశాఖ, ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చేందుకు నాకు 8 ఏళ్ల సమయం పట్టింది. పెట్టుబడుల కోసం ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతోనే కాదు.. ఇతర దేశాలతో పోటీపడుతున్నాం. ఈ కష్టాన్ని ప్రజలు కూడా అర్థం చేసుకున్నారు.

**ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం** ఈ పెట్టుబడులు ఒక్కరోజులో రాలేదు. మంతెన రామరాజు, ఎన్ఆర్ఐ టీడీపీ నేత సాగర్ దొడ్డపనేని, కాటంనేని భాస్కర్ ఈ ప్రాజెక్ట్ ను విశాఖపట్నానికి తీసుకురావడంలో ఎంతో కీలకపాత్ర పోషించారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఎంతో మంది కృషి ఉంది. గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ 2047 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. విశాఖపట్నం ఏపీకి ఆర్థిక రాజధాని. ఇది మా అజెండా. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ప్రజలు ఆ విధంగానే ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. 94 శాతం సీట్లతో విజయం సాధించాం. సమర్థ పాలనకు, ఉద్యోగాల సృష్టికి, విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడానికి ప్రజలు స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు.

**విశాఖ ప్రజలు ఎప్పుడూ టీడీపీతోనే ఉన్నారు** ఈ నగరంపై నాకు ప్రత్యేకమైన ప్రేమ ఉంది. 2019లో రాష్ట్రంలో, ఇతర ప్రాంతాల్లో మేం ఓడిపోయినా విశాఖ ప్రజలు మాత్రం మాతోనే ఉన్నారు. విశాఖ ప్రజలు ధైర్యవంతులు. 2014 సమయంలో హుద్ హుద్ విపత్తు వచ్చినప్పుడు నగరం తీవ్రంగా నష్టపోయింది. అప్పుడు విశాఖ ప్రజలు నగర పునరుద్ధరణకు చంద్రబాబునాయుడు కు ఎంతో మద్దతుగా నిలిచారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా నష్టాన్ని స్వయంగా చూశారు. ఇంత విధ్వంసం తర్వాత కూడా ప్రజలు చిరునవ్వుతో చేతులు ఊపుతూ స్వాగతం పలికారు. అది విశాఖ ప్రజల స్ఫూర్తి.

**భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖపట్నానికే వస్తోంది** గత 17 నెలల్లో ఏపీకి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతం కంటే ఎక్కువగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ కు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ విశాఖకు వస్తోంది. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖపట్నానికే వస్తోంది. దీనివల్ల శక్తివంతమైన ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. సూపర్ సిక్స్ హామీల్లో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తాం. ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ రైలులా దూసుకెళ్తోంది టీసీఎస్ కు 99 పైసలకే భూమి కేటాయించారని కొంతమంది నన్ను విమర్శించారు. కొంతమంది కోర్టుకు కూడా వెళ్లారు. నేను ఇక్కడ రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు. ఆ పార్టీ ఏం చేసిందో అందరికీ తెలుసు. ఆ నిర్ణయం వల్ల కాగ్నిజెంట్, యాక్సెంచర్, సత్వా, గూగుల్ వంటి సంస్థలు విశాఖకు వచ్చాయి. ఒక విధాన నిర్ణయం ఎన్నో మార్పులకు కారణమైంది. విశాఖకు ఇది ఎంతో కీలక సమయం. ఇది కేవలం డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే కాదు.. డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ రైలులా దూసుకెళ్తోంది. ఏపీ ఆర్థిక అజెండాకు ప్రధాని నరేంద్ర మోదీ సహకరిస్తున్నారు. కేంద్రం చేపట్టే ఆర్థిక సంస్కరణల్లో ఏపీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. విశాఖలో 3 లక్షల మంది యోగాంధ్ర నిర్వహించి గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డ్ సృష్టించాం. ఇది చూసి ప్రధాని ఆశ్చర్యపోయారు. ఇదీ విశాఖ ప్రజల నిబద్ధత.



ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోగలిగాం ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోగలిగాం. కేంద్రం స్టీల్ ప్లాంట్ కు రూ.11వేల కోట్ల సాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లు అందించింది. మూడు ఫర్నేస్ లు ఇప్పుడు పనిచేస్తున్నాయి. వంద శాతం సామర్థ్యంతో నడిపి ప్లాంట్ ను లాభదాయకంగా మారేలా చేస్తాం. నిధులు అడగాల్సిన అవసరం రాకూడదు. ఇదే మా లక్ష్యం. రూ.14వేల కోట్ల సాయం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించడమే కాదు.. అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం. ఇది కేవలం ఏపీ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాదు.. భారత్ ఆర్థిక వ్యవస్థకూ దోహదం చేస్తుంది. రైల్వే జోన్ సాధించాం, స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నాం. ఇప్పుడు టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి ఐటీ కంపెనీలు వస్తున్నాయి. వచ్చే మూడు నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఏ ఒక్క పెట్టుబడి పొరుగు రాష్ట్రాలకు వెళ్లకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఇది తొలి అడుగు మాత్రమే. మొత్తం ఎకో సిస్టమ్ రావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్న, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ హర్షా రామ్, రాజేష్ తిరుమల రాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఐటీ కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, ఇతర ఉన్నతాధికారులు ఎన్.యువరాజ్ పాల్గొన్నారు

## యువత.. పాతికేళ్ల భవిత కోరుతున్నారు

జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం చేసిన ట్వీట్ సంచలనం రేపుతోంది. ఏపీ యువత పాతికేళ్ల భవిష్యత్ కోరుతున్నారని.. ఉచితాలు, సంక్షేమ పథకాలు కాదని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. 2018 అక్టోబరు 12న పవన్ ఉత్తరాంధ్ర పర్యటనలో కొందరు యువకులతో భేటీ నిర్వహించి చర్చలు జరిపారు. అప్పటి ఫొటోను పౌరసరఫరాల మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తాజాగా పోస్టుచేశారు. దానిని పవన్ ట్యాగ్ చేస్తూ.. 'ఏపీలో యువత సంక్షేమ పథకాలు, ఉచితాలు అడగడం లేదు. పాతికేళ్ల భవిష్యత్‌ను అడుగుతున్నారు. అందుకే తరచూ వారిని కలుస్తూ వారి కలలను నిజం చేసేందుకు కృషిచేస్తున్నా' అని ట్వీట్ చేశారు. ఇది సర్వత్రా చర్చకు దారితీసింది.

## ఎస్సారెస్పీ ఫేజ్ 2కు దామోదర్‌రెడ్డి పేరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ఫేజ్-2కు దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి (ఆర్డీఆర్) పేరు పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇదే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఆదివారం దామోదర్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగిన సంతాపసభకు సీఎం రేవంత్ హాజరై మాట్లాడారు. తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలు నీటి సౌకర్యం లేక ఎడారిగా మారే ప్రమాదం ఉందని, ప్రజలకు నివాసయోగ్యం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ఇచ్చిందని, దీంతో దామోదర్‌రెడ్డి ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకువచ్చి సస్యశ్యామలం చేయాలన్న ఆలోచన చేశారని తెలిపారు. ఫ్లోరైడ్ భూతాన్ని తరమడంలో దామోదర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, శ్రీరాంసాగర్ జలాలను కరీంనగర్, వరంగల్‌తోపాటు నల్లగొండ (ప్రస్తుత సూర్యాపేట) జిల్లాకు ఇవ్వాలంటూ పోరా డారని గుర్తు చేశారు. నల్లగొండలో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయంటే అది దామన్న వల్లేనన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు దామోదర్‌రెడ్డి నాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ ఫేజ్-2కు శంకుస్థాపన చేయించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆయన క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న దామోదర్‌రెడ్డి వైఎస్సార్‌పై ఒత్తిడి తెచ్చి.. కాల్వల నిర్మాణం పూర్తిచేయించారని పేర్కొన్నారు. గోదావరి జలాల కోసం ఇంతగా పోరాడిన దామోదర్‌రెడ్డి పేరును ఆ ప్రాజెక్టుకు పెడుతూ 'ఆర్డీఆర్ ఎస్సారెస్పీ ఫేజ్-2'గా నామకరణం చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఇందుకు సంబంధించి 24 గంటల్లో జీవో విడుదల చేస్తామన్నారు. దామోదర్‌రెడ్డి కుటుంబానికి 'గాంధీ' కుటుంబం అండగా ఉంటుందని, ఆర్డీఆర్ మృతి పట్ల సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే ఈ విషయం చెప్పారని తెలిపారు. దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డికి రాజకీయంగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## వివేక్ వర్సస్ అడ్లూరి


మరోసారి ప్రస్తావించడమే ఇందుకు కారణమైంది. ఆదివారం నిజామాబాద్‌లో నిర్వహించిన మాలల ఐక్య సదస్సుకు మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని, అయినా ఉద్దేశపూర్వకంగానే తనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తాను మాలల కోసం పోరాటం చేస్తుంటే.. కొందరు కావాలనే కుట్రలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా తనను అవమానించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మంత్రిగా తన పని తాను చేసుకుపోతున్నానని, మంత్రి అడ్లూరి విషయంలో అనవసరంగా తన పేరును ప్రచారం చేశారని వాపోయారు. తనది మాల జాతి అంటూ మంత్రి అడ్లూరి విమర్శిస్తున్నారని, కానీ.. ఆయనను రాజకీయంగా ప్రోత్సహించింది తన తండ్రి వెంకటస్వామి (కాకా) అనే విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడుతున్నామని, తాను ఇన్‌చార్జి అయ్యాక అక్కడ కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని వ్యాఖ్యానించారు. కాగా, మంత్రి వివేక్ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెంటనే స్పందించారు. ముగిసిన వివాదాన్ని వివేక్ మళ్లీ తెరపైకి తెచ్చారని, ఈ అంశాన్ని ఇక అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాలలను గౌరవించిందెవరో అందరికీ తెలుసునని, ఎవరు ఎవరిని అవమానిస్తున్నారో చర్చకు సిద్ధమని చెప్పారు. మంత్రి వివేక్ కుమారుడిని ఎంపీగా గెలిపించింది తాము కాదా? అని ప్రశ్నించారు. గతంలో వివేక్ తండ్రి అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ ఇచ్చారనడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. "ఏదైనా మన పార్టీ నేతల సమక్షంలో అంతర్గతంగా మాట్లాడితే బాగుండేది" అని వ్యాఖ్యానించారు.

## రిజర్వేషన్ల సాధనకు బీసీ జేఏసీ

రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు ఏకమయ్యాయి. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు 'బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (బీసీ జేఏసీ) ఆవిర్భవించింది. ఆదివారమిక్కడి ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో బీసీ-జేఏసీని ఏర్పాటు చేశారు. జేఏసీ ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ఛైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ ఛైర్మన్‌గా వీజీఆర్ నారగోని, కో ఛైర్మన్లుగా రాజారాంయాదవ్, దాసు సురేష్, సమన్వయకర్తగా గుజ్జ కృష్ణను ఎన్నుకున్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఈ నెల 13న జాతీయ రహదారుల దిగ్బంధానికి పిలుపునివ్వగా.. ఆర్.కృష్ణయ్య ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు కార్యక్రమాలను వాయిదా వేసి, 18న రాష్ట్ర బంద్‌ను చేపట్టాలని నిర్ణయించారు. కృష్ణయ్య మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లపై స్టే విధించడం ద్వారా రాష్ట్రంలోని బీసీలకు హైకోర్టు అన్యాయం చేసిందన్నారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ బీసీలంతా రాజకీయ పార్టీలకతీతంగా ఏకమై పోరాడితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివస్తాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని భవిష్యత్తులో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించేదాకా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న జరిగే బంద్‌లో బీసీలు పార్టీలకతీతంగా పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. జాజుల శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీల నోటికాడ ముద్దను పిడికెడు మంది కూడా లేని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ వ్యతిరేకులకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ పెట్టడానికి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. అందుకే రాష్ట్రంలోని ప్రధాన బీసీ సంఘాలు, వ్యక్తులు, శక్తులను సమన్వయం చేసుకుని బీసీ జేఏసీగా ఏర్పడినట్లు తెలిపారు. రెడ్లను రాజకీయ శత్రువులుగా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. బంద్ ఫర్ జస్టిస్ పేరిట ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌తో బీసీల బలాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చూపుతామన్నారు.

## డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

### బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి



"డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ ఛైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు. సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

# ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యం





## మంత్రి ఎన్ఎండి ఫరూక్

నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక నంద్యాల: గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, వాటి ఆవశ్యకతపై ప్రజలలో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో నంద్యాల స్థానిక టేక్కే మార్కెట్ యార్డ్ నందు ఏర్పాటు చేసిన 'కామధేను సిరి సంపద – నవనందుల నంద్యాల చెంత గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సంత' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించి, వాటిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతోనే మన సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని . రసాయన ఎరువులు, పురుగుమందులు లేని ఆహారం మన ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని . రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందన్నారు , రైతులు ఈ విధానంలో సాగుచేసి, ప్రజలకు స్వచ్ఛమైన ఆహారాన్ని అందించాలి, అని పిలుపునిచ్చారు. గో ఆధారిత వ్యవసాయం వల్ల భూసారం పెరుగుతుందని, పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగులో ముందుండాలని ఆకాంక్షించారు. నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించడంలో మార్కెట్ యార్డు పూర్తి సహకారాన్ని అందిస్తుందని. ఈ సంత ద్వారా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు మంచి వేదిక లభించిందని తెలిపారు. ఈ సంతలో వివిధ రకాలైన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, దేశవాళీ వంగడాలు, కాయగూరలు, చిరుధాన్యాలు, ఆయుర్వేద ఉత్పత్తులు ప్రదర్శనకు మరియు అమ్మకానికి ఉంచారు. రైతులు, స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రివర్యులు ఫరూక్ పరిశీలించి, రైతులతో, వినియోగదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.పీకే ప్రచార సాధకులు మరియు ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరాం , నంద్యాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రంగ ప్రసాద్ , ప్రముఖ పారిశ్రామికవేత పబ్బతి వేణు, డిపిఎం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు యాదవ్, ఏడిపిఎం ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ అబ్దుల్ సలామ్,కామధేను సిరిసంత వ్యవస్థాపకులు కర్రెద్దుల బాలమదిలేటి, కామదేను సిరి సంత వ్యవస్థాపకుడు సుబ్బారావు , ధనుంజయ రెడ్డి, లత , అయ్యలూరు టిడిపి అధ్యక్షులు త్రిలింగేశ్వర్ రెడ్డి మరియు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతులు, ప్రకృతి వ్యవసాయ అనుభవజ్ఞులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.






# సమాచార హక్కు చట్టం భారత ప్రజాస్వామ్యం లో మైలు రాయి





నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ):ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నంద్యాల జిల్లా కార్యాలయములో సమాచార హక్కు చట్టం 2005 ఇరవై యొవా( 20)ఆవిర్భావ దినోత్సవము సందర్భముగాబి ఐక్య వేదిక కార్యకర్తలకు సమాచార హక్కు చట్టం పై అవగాహన జిల్లా ఉపాధ్యక్షులు మస్తాన్ వలి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమల్ల రహీమ్ పాల్గొని స. హ. చట్టం ప్రాముఖ్యత, ఈ చట్టం రావడానికి కృషి చేసిన మేధావుల గురించి తెలుపుతూ ఈ సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం ఏమనగా పాలనలో పారదర్శకత,అధికారులలో జవాభూదారి తనం పెరగాలన్నేడే ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం. కానీ ఈ స. హ. చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన భాద్యత ప్రభుత్వాలాది. గత 20 సంవత్సరాల నుండీ ఏ ప్రభుత్వం ఈ సమాచార హక్కు చట్టాన్ని గురించి ప్రజలు కు అవగాహన కల్పించకపోవడముతో మా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆ భాద్యత తీసుకొని ప్రజలకు ఉచితంగా శిక్షణ ఇస్తూ అవగాహన పెంచుతూ ప్రజలను చట్టాల పట్ల చైతన్యం చేస్తూ వస్తున్నారని తెలిపారు. ఎంతమేరా ప్రజలు చట్టలపట్ల అవగాహన పరులు కావాలెనో అంతమేరా అవగాహన పరులు కా నందుననే చట్టాలు పూర్తి స్థాయిలో అమలు కావట్లేదు. దీనికి పూర్తి భాద్యత కే వలము ప్రభుత్వాలాడే కాదు ప్రజలది కూడా, కావున ప్రజలు రాజ్యాంగం పట్ల, చట్టలపట్ల అవగాహన పరులయి ప్రశ్నించే తత్త్వం అలవడితేనే చట్టాలును అమలు చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగాలగుతామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీమ్ తెలిపారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టపు కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీమ్, జిల్లా ఉపాధ్యక్షుడు మస్తాన్ వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి రహంతుల్లా, జిల్లా సాంస్కృతిక విభాగపు కన్వీనర్ శివ రామి రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు నబి రసూల్, పట్టణ ఉపాధ్యక్షులు సంజీవ రాజు, చంద్రపాల్, మహిళా విభాగపు కోశాధికారి నీలుమా, మరియు ఇసుకపల్లి మధు, పెద్ది రెడ్డి, తిరుమలేశు, హుస్సేన్ బాష, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

### సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, నంది పత్రిక జిల్లా బ్యూరో, అక్టోబర్ 12:- నేడు (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# ప్రధాని పర్యటన సందర్భంగా శ్రీశైలం నందు పటిష్ట బందోబస్తు ఏర్పాటు...

### బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్





అక్టోబర్ 12(నంది పత్రిక) అక్టోబర్ 16 న భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రముఖ పుణ్యక్షేత్రం జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇప్పటికే శ్రీశైల పరిసర ప్రాంతాలలు, నల్లమల్ల అడవి ప్రాంతాలలో గ్రేహౌండ్స్ సాయిధ బలగాలు ప్రధాని పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ %ఖూూ% గారు ప్రధాని పర్యటించే ప్రదేశాలలో అనగా హెలిపాడ్,రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, గుడి పరిసర ప్రదేశాలు, సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.



# వక్ఫ్ బోర్డ భూములను పరిరక్షించండి



నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మరియు న్యాయశాఖ మంత్రి ఫరూఖ్ ని కలిసిన మైనారిటీ రైట్స్ ఫోరం ప్రెసిడెంట్ షేక్.దస్తగిరి మరియు అధికార ప్రతినిధి డా. షేక్ ఇబ్రహీం. మంత్రిని కలిసి మైనారిటీ సబ్సిడీ రుణాలు, ముస్లిం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు మరియు వక్ఫ్ బోర్డ భూముల పరిరక్షణ గురించి, వక్ఫ్ బోర్డు స్థలాల సమస్యలపై చర్చించారు. వేంపల్లె ఉర్దూ కళాశాలకు సంబంధించిన విద్యార్థినుల ప్రొటెక్షన్ మరియు కళాశాల డెవలప్మెంట్ అంశాలపై ప్రస్తావించారు. ముఖ్యంగా కడప టౌనులో అమీన్ పీర్ దర్గా ( పెద్ద దర్గా ) వక్ఫ్ బోర్డు పరిధిలో ఉంది. కావున అమీన్ పీర్ దర్గాకు సంబంధించిన ఏ ఉత్సవమైన వక్ఫ్ బోర్డు అనుమతితో జరగాలి. ఇదివరకు ఇతరులు వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా ఇష్టానుసారంగా పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాన్ని నిర్వహించి అందినంతా దోచుకుతిన్నారు. కావున వక్ఫ్ బోర్డు అధీనంలో ఉన్న పెద్ద దర్గా ( అమీన్ పీర్ దర్గా ) ఉరుసు ఉత్సవాలు బహిరంగా టెండర్లు నిర్వహించి, బహిరంగంగా టెండరు అనుమతి పొందినవారికి అనుమతి ఇచ్చి, వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని పెంచండని మైనారిటీ రైట్స్ ఫోరం అధ్యక్షుడు షేక్. దస్తగిరి, అధికార ప్రతినిధి డా. షేక్ ఇబ్రహీం, ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జాకీర్ మౌలానా మరియు ఆళ్లగడ్డ ముస్లిం జేఏసీ కన్వీనర్ బీరువాల బాషా, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అష్రఫ్ అలీఖాన్, సల్ఫియా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అన్వర్, అల్ ఇండియా ముస్లిం సేవా సమితి చాంద్ బాష, మైనారిటీ వెల్ఫేర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం, అడ్వైజర్ మస్తాన్ వల్లి మరియు మైనారిటీ రైట్స్ ఫోరం నాయకులు షేక్. గౌసుల్లా, వెంకట రమణ పలు అంశాలపై మంత్రి గారికి విన్నవించడం జరిగింది. వెంటనే ఈ సమస్యలను పరిష్కారమిస్తామని మంత్రి ఫరూఖ్ హామి ఇవ్వడం జరిగింది. మైనారిటీ మంత్రి ఫరూఖ్ కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన వాగ్దానాలను తప్పక నేరవేస్తామని కూడా మరొక హామిని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ని మైనారిటీ రైట్స్ ఫోరం వారు పూలబోకేతో ఘనంగా సన్మానించడం జరిగింది.

# అంజుమన్ సంస్థ చేస్తున్న సేవలను నిరుపేద ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలి

### -అధ్యక్షులు ఎన్ ఎం డి ఖుదుస్



నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ):నంద్యాల పట్టణం అంజుమన్ షాదికానలో ఆదివారం పేద ముస్లిం యువతి యువకులకు సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎన్ ఎం డి ఖుదుస్ నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాష పాల్గొని ఏడు మంది నిరుపేద ముస్లిం యువతులకు వివాహం జరిపించి యువతి తల్లిదండ్రులకు 50 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంజుమన్ సంస్థ నిరుపేద ముస్లింలకు అండగా ఉంటుందని సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఎంతమంది వచ్చినా వారందరికీ వివాహాలు జరిపించి 50 వేల రూపాయలను అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్షిప్లు పంపిణీతో పాటు మసీదులకు రంజాన్ మాసం నందు జానీ మాసులను పంపిణీ చేయడం అంజుమన్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు జరుగుతుందన్నారు సంస్థాందిస్తున్న సేవా కార్యక్రమాలను నిరుపేద ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో అంజుమన్ సంస్థ సభ్యులు ఉపాధ్యక్షులు అబ్దుల్ హక్ హితాయతుల్లా షేక్ మొహమ్మద్ గౌస్ షేక్ మున్నా కమిటీ సభ్యులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



# మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ – స్పీకర్ అయనపాత్రుడు మధ్య స్నేహం 40 సంవత్సరాల మైలురాయిని చేరుకుంది."




నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవనీయ స్పీకర్ అయ్యనపాత్ర మరియు రాష్ట్ర మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మధ్య ఆత్మీయ స్నేహం ఈ సంవత్సరం 40 సంవత్సరాల మైలురాయిని చేరుకుంది . తెలుగు దేశం పార్టీ ఏర్పడినప్పటి నుండి, ఇద్దరు నాయకులు పార్టీకి అంకితభావంతో సేవ చేస్తున్నారు, ఒకరు రాయలసీమ నుండి మరియు మరొకరు ఉత్తర ఆంధ్ర నుండి, రెండు ప్రాంతాల ఐక్యతకు చిహ్నాలుగా నిలిచారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో కలిసి నిలబడింది, అనేక ఉన్నత పదవులను గెలుచుకుంది మరియు పార్టీని వీడకుండా అనేక అడ్డంకులను ఎదుర్కొంది, ప్రస్తుతం ఒకరు గౌరవనీయ స్పీకర్‌గా మరియు మరొకరు మంత్రులుగా ప్రజలకు సేవ చేస్తున్నారు. ఈ స్నేహం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని మేము హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము అని తెలిపారు.

# సింగరాజు పల్లెకు బస్సు సౌకర్యం.

### – హారతులు ఇచ్చిన ప్రజలు



కొత్తపల్లి – నంది పత్రిక : మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోకి వచ్చిన ఆర్టీసీ బస్సుకు మామిడి తోరణాలు పూలమాలలు వేసి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం హారతులిచ్చి హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. గతంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో అర కిలోమీటర్ నడిచి బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి ఉండే వాళ్ళం అన్నారు. ప్రస్తుతం బస్సు గ్రామంలోకి రావడంతో ఆత్మకూరు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. బస్సును సింగరాజు పల్లి గ్రామంలోకి వేసినందుకు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లెల్ల శ్రీదేవి ని ఘనంగా సన్మానించిన నంద్యాల నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు..!





**నంద్యాల ప్రతినిధి. జనవాహిని న్యూస్. అక్టోబర్ 12.** శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లెల్ల శ్రీరాములు సతీమణి జిల్లెల్ల శ్రీదేవికి నంద్యాల నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, త్యాగరాజు స్వామి దేవస్థానం చైర్మన్ ఊడుమాల్పూరం మల్లుగాళ్ళ సుబ్బరాయుడు మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం పాలకమండలి చరిత్రలో ఒక రజక మహిళకు (లిజిల్లెల్ల శ్రీరాములు సతీమణి జిల్లెల్ల శ్రీదేవి) పాలక మండలి సభ్యురాలుగా నియమించడం ఇదే మొదటిసారి అని అన్నారు. ఆ పరమేశ్వరుడికి సేవ చేసుకునే అవకాశం రావడం ఎంతో గొప్ప విషయం అన్నారు. జిల్లెల్ల శ్రీదేవి శ్రీశైలం దేవస్థానం ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని, మంచి పేరు ప్రఖ్యాతలు గడించాలని ఆకాంక్షించారు. అనంతరం నాయి బ్రాహ్మణ మిత్రులు తిరుపతయ్య, పెద్ద రాంపుల్లయ్య, రామ మద్దయ్య విశ్వనగర్ టీడీపీ ఇంచార్జ్, జిల్లెల్ల చిన్న రాంపుల్లయ్య ప్రెసిడెంట్, దుర్వేసి వెంకటేశ్వర్లు (ప్రెసిడెంట్) లు దుశాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈనెల 18న శ్రీ ధన్వంతరి మహర్షి జయంతిని పురస్కరించుకొని నంద్యాల శ్రీ త్యాగరాజ స్వామి దేవాలయం నందు ప్రతి సంవత్సరం నిర్వహించే నాదస్వరం విద్వాంసులకు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ధన్వంతరి వైద్యులకు, వచ్చిన అతిథులకు గౌరవ సన్మానం మరియు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన వలసిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు

# వేంపల్లె ఉర్దూ కళాశాల అభివృద్ధి, మర్కస్ మసీద్ రక్షణ కొరకు మంత్రి ఫరూక్ కు వినతిపత్రం



**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 12 . (నంది పత్రిక ):**నంద్యాల : కడప జిల్లాలోని వేంపల్లె ప్రాంతంలో గల ఉర్దూ కళాశాల అభివృద్ధి, మరియు మర్కస్ మసీద్ రక్షణ, అభివృద్ధి కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి వేంపల్లె మసీద్ కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారిని మసీద్ కమిటీ సభ్యులు షేక్ ఇబ్రహీం, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కలిసి వేంపల్లె ఉర్దూ కళాశాల అభివృద్ధి ఆవశ్యకతను, అలాగే మర్కస్ మసీద్‌కు రక్షణ కల్పించి, దాని అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు . ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ ఈ విషయంపై సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు



# అక్టోబర్ 17న తణుకులో జిల్లా యువజనోత్సవములు..

**పోటీల్లో పాల్గొనేందుకు 15 నుండి 29 సంవత్సరాల యువతీ యువకులు అర్హులు.**
**రాష్ట్రస్థాయి పోటీలు నవంబర్ 2025 న విజయవాడలో..**
**జాతీయ స్థాయి పోటీలు జనవరి 2026 ఢిల్లీలో**
**అక్టోబర్ 15న ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళ ఎస్ ఆర్ కె ఆర్ ఏ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహణ..**
**జిల్లా కలెక్టర్ మరియు సెట్ వెల్ చైర్మన్ చదలవాడ నాగరాణి.**



**భీమవరం చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** 2026 జనవరి 12న వివేకానంద జయంతి సందర్భముగా జరుగు జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యములో యువతకు అనేక అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయి పోటీలకు, అదేవిధంగా రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయిలో జరిగే జాతీయ యువజనోత్సవాలకు పంపడం జరుగుతుంది అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను అక్టోబర్ 17న తణుకు ఎస్ కే ఎస్ డి మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబర్ 15న భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా స్థాయి పోటీ అంశాలలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం (సోలో), వెస్ట్రన్ డాన్స్ (గ్రూపు) ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీలకు అభ్యర్థులు సొంత ఖర్చులతో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పోటీలకు సంబంధించిన వాయిద్య పరికరాలు, అలంకరణలు, తదితర వస్తువులు అన్నింటిని అభ్యర్థులే సమకూర్చుకోవాలన్నారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి నుండి జాతీయస్థాయికి ఎంపిక కాబడిన అభ్యర్థులకు ప్రయాణ, భోజన వసతి సదుపాయాలు అన్ని యువజన సర్వీసుల శాఖ అందించడం జరుగుతుందన్నారు.

పోటీల్లో పాల్గొను యువతీ యువకుల వయస్సు 15 నుండి 29 సంవత్సరాలు మాత్రమే ఉండాలని, రాష్ట్రస్థాయి పోటీలు 2025 నవంబర్ నెలలో, జాతీయ స్థాయి పోటీలు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 2026 జనవరి నెలలో ఢిల్లీలో జరుగు జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్స్ 9441446999, 9490938012, 7075230609 నందు సంప్రదించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే యువజనోత్సవాలలో యువతి, యువకులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య.



**కేసముద్రం, అక్టోబర్ 12(నంది పత్రిక):**మద్యానికి బానిసైన వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఘటన భూక్య రామ్ తండాలో చోటు చేసుకుంది. భూక్యరాం తండాకు చెందిన బానోత్ వెంకన్న(37) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై ప్రతి రోజు అక్కడక్కడ అప్పులు తీసుకోని వచ్చి మద్య%శీ% సేవించే క్రమంలో ఎక్కువ అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆదివారం తన వ్యవసాయ భూమి వద్ద గడ్డి మందు త్రాగగా, అతనిని వెంటనే మహబూబాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించే సమయంలో చనిపోయాడని, అతని తండ్రి ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**అక్టోబరు 13 (సోమవారం) కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్) నిర్వహణ**
**సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మ.1.30 గంటల వరకు పిజిఆర్ఎస్**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం: చీఫ్ బ్యూరో అక్టోబర్ 12, నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు

అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసు కోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం అక్టోబర్ 13న కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి %వీవవనిశీయిఎ. ఖజూ.స్ర్రశీజ.అఅ% వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు.



**ములుగు జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 ( నంది పత్రిక)** ములుగు జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (13/10/2025) రోజున నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క గార్లు ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం లో శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 ఏర్పాట్ల పై ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశంనిర్వహించనున్నందున, ప్రజావాణికార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.వచ్చే సోమవారం యథావిధిగా జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమాన్నినిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో వెల్లడించారు.

# భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే







**ప్రతిభ పాటవాలే భూమికగా డీఎస్సీ నియామకాలు....**
**రాష్ట్రంలో విద్యా సంస్కరణలకు ఆద్యుడు ముఖ్యమంత్రి చంద్రబాబు.....**
**మెగా డీఎస్సీతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం....**
**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....**

**రావులపాలెం చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** మెగా డీఎస్సీ నిర్వహణతో ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో మెగా డీఎస్సీలో ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన కొత్తపేట నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులకు అయన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించిన 150 రోజుల్లోనే మొత్తం ప్రక్రియను అంత పూర్తి చేసి నియామకాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కాకముందు రాష్ట్రంలో టీచర్ల బదిలీలు మొదలైన అంశాలన్నీ రాజకీయ నాయకులు చేతుల్లోనే ఉండేవని అన్నారు. రాష్ట్రంలో విద్యాసంస్కరణలను అమలు చేస్తూ 10 వరకు డీఎస్సీలు నిర్వహించి 2లక్షల మంది ఉపాధ్యాయులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. టీచర్ల బదిలీలు మొదలైన అంశాలన్నీ ప్రతిభ ఆధారంగా కౌన్సిలింగ్ ద్వారా చేపట్టిన ఘనత సైతం ఆయనదేనన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకంగా చేసిన మెగా డీఎస్సీలో ప్రతిభ పాటవాలే భూమికగా ఉపాధ్యాయులను నియమించడం ద్వారా నిరుద్యోగులకు ఎంతగానో మేలు జరిగిందన్నారు. డీ ఎడ్, బీఎడ్ చదువుకున్న యువత ఆశలను కూటమి ప్రభుత్వాన్ని నిజం చేసింది అన్నారు. మరో డీఎస్సీకి వచ్చే సంవత్సరం మార్చిలో నోటిఫికేషన్ ఇస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలపడం నిరుద్యోగులకు ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. యువతకు టీచరు ఉద్యోగాలు కల్పించడంతోపాటు, విద్యాభివృద్ధి ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కూటమి ప్రభుత్వం నమ్ముతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయుల భర్తీతోపాటు కార్పొరేట్ పాఠశాలలకు తగినట్లుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న ఘనత మంత్రి నారా లోకేష్ కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగిందని ఆయన అన్నారు. పిల్లలందరూ కార్పోరేట్ స్కూళ్ల వైపు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేలా అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇందుకోసం ప్రతిభ కలిగిన టీచర్లను నియమించడం కోసం మెగా డిఎస్సీ నిర్వహణ, కౌన్సెలింగ్ ద్వారా వారు కోరుకున్నచోట వారికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చేలాగా కూటమి ప్రభుత్వం పని చేసిందన్నారు. మెగాడిఎస్సిలో ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించిన వారికి నేడు సత్కారం నిర్వహించామన్నారు. వారు సైతం కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నిర్వహణ పట్ల చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. వారు భావితరాల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేస్తారని ఆయన తన ఆకాంక్ష వ్యక్తం చేశారు. వారికి శుభాభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అయినవిల్లి సత్తిబాబు గౌడ్, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్, కుసంపూడి రామకృష్ణ రాజు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై ప్రత్యేక డ్రైవ్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

**జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**గుంటూరు చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** గుంటూరు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, శనివారం (11 రాత్రి జిల్లా వ్యాప్తంగా లి"ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని, లి"టౌన్ న్యూసెన్స్ యాక్ట్ ప్రకారం మొత్తం 106 మందిపై 104 కేసులు నమోదు చేసి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించినారు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, రాత్రి వేళల్లో జరిగే చట్టవ్యతిరేక చర్యలను నిరోధించడం ఈ ప్రత్యేక డ్రైవ్ యొక్క ఉద్దేశ్యం..

**జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.** మద్యం సేవించి రాత్రి వేళల్లో రోడ్లపై తిరగడం వలన గొడవలు, అల్లర్లు, దొంగతనాలు మరియు ఇతర నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు రాత్రి సమయాల్లో అనవసరంగా బయట తిరగకుండా ఉండాలి. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై "%ఱశీఉఅ చీబఱఝఅఎవ ఖ౯%" ప్రకారం కేసులు నమోదు చేసి,కఠినంగా వ్యవహరిస్తాం." జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ విధులను బలోపేతం చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి విచారణలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్స్ ఉన్నవారు ఏవైనా సంఘటనల్లో పాల్గొంటే, కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

**ప్రజలకు విజ్ఞప్తి** మీ ప్రాంతంలో రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నవారు గానీ, ప్రజా శాంతికి భంగం కలిగించే వ్యక్తులు గానీ కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కి సమాచార%శీ% ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ బృందం రాత్రి గస్తీలను మరింత ముమ్మరం చేసి, జిల్లా ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ఎస్పీ తెలిపారు.

# కళాత్మకం .. గజేంద్రమోక్ష కుడ్య శిల్పం ..!

**వైయస్సార్ కడప జిల్లా చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** వల్లూరు మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ,పంచనదీ క్షేత్రం పుష్పగిరి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గోడపై గజేంద్ర మోక్షాన్ని తెలిపే కుడ్య శిల్పం కళాత్మకమైందని రచయిత,చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం అన్నారు. శ్రీ పోతన భాగవతంలో పరీక్షితుడు అనే మహారాజుకు శుక మహర్షి గజేంద్రమోక్షం కథను చెప్పాడని తెలిపారు. దేవలుడు అనే ముని శాపం వల్ల హూ హూ అనే గంధర్వుడు మొసలి అవతారం పొంది తరువాత శివుని కరుణతో గంధర్వ రూపాన్ని పొందాడని చెప్పారు.ఇంద్రజ్ఞుమునుడు అనే రాజు అగస్త్యమహర్షిని ఉదాసీనంగా చూసిన కారణంగా ఏనుగు జన్మ ఎత్తి అనేక బాధలు పొందాడని వివరించారు.

**త్రికం అనే పర్వతం** , దానికి మూడు శిఖరాలు ఉన్నాయన్నారు. ఒక శిఖరం బంగారంతో, ఇంకొక శిఖరం ఇనుముతో, మరొక శిఖరం వెండితో అలరారుతూ ఉండేవని చెప్పారు. ఆ కొండలపై గగనచారులు కిన్నెరలు విహరిస్తూ ఉండేవారని తెలిపారు. ఆ పర్వత%శీ% పైన అడవులలో అనేక క్రూర మృగాలతో పాటు ఏనుగుల గుంపు కూడా సంచరిస్తూ ఉండేదని వివరించారు. దీంతో ఆ ఏనుగుల గుంపు ఒకరోజు ఆహారం తీసుకొని దాహాన్ని తీర్చుకోవటానికి సరోవరాన్ని చేరాయని తెలిపారు. అతి విశాలమైన సరోవరం నిండా కలువలు, తామరలు, అనేక జలచరాలు నివసిస్తూ ఉండేవని చెప్పారు. ఆ సరోవరంలో ఆడ ఏనుగులు దాహాన్ని తీర్చుకొని జల క్రీడలు జరిపాయన్నారు. తరువాత గజరాజు సరోవరంలోకి ప్రవేశించి నీళ్లు తాగి తొండ%శీ% నిండా నీటిని నింపి గగన వీధికి చిమ్ముతూ కర్కాటక మీనాలు, రోదసిలోని మీన కర్కాటకాలను చేరినట్లు కనిపించేదని చెప్పారు. ఆ సరోవరంలో జలకాలాడుతున్న ఆ గజరాజు ముందరికాళ్ళను ఓ మకరం (మొసలి) గట్టిగా పట్టుకుందని తెలిపారు. దీంతో ఆ గజరాజు తన తొండ%శీ%తో, కొమ్ములతో బలంగా మొసలిని కుమ్మిందన్నారు. వెంటనే ఆ మొసలి గజరాజు తోకను పట్టుకొని చీల్చిందని చెప్పారు. అంతటి బలమున్న గజరాజు సైతం బలహీనుడై ఆ సరోవరంలో స్థాన బలమున్న మకరం చేతిలో ప్రాణాలు వదలవలసి వస్తోందని, ఆవేదన చెందుతూ ఆ శ్రీమన్నారాయణుని వేడుకొంటూ పాహి,పాహి అని ప్రాధేయపడే కేక శ్రీమహావిష్ణువుకు వినపడిందనివివరించారు. శ్రీమహావిష్ణువు మహాలక్ష్మితో ఆనందంగా గడుపుతుండగా గజరాజు ఆర్తనాధాన్ని విన్న విష్ణువు ఎవరికి చెప్పకుండా ఆ గజరాజు ఉన్న సరోవరాన్ని చేరారని తెలిపారు. తన సుదర్శన చక్రాన్ని విడిచి పెట్టగానే విస్ఫులింగాలు చిమ్ముతూ ఆ సుదర్శనం మరుక్షణంలో సరోవరంలోకి ప్రవేశించి ఆ మొసలి తలను ఖండించిందని తెలిపారు. ఆ గజరాజు ఊపిరి పీల్చుకొని ఏనుగుల బృందాన్ని చేరి సంతోషంతో తో%శీ%డాన్ని ఎత్తి మహావిష్ణువును పలకరించాడని చెప్పారు. ఆ నారాయణుడు తన కరస్పర్శతో ఆ కరినిని అనుగ్రహించడంతో గజేంద్రుడు వైకుంఠ ప్రాప్తి పొందాడని



వివరించారు. ఈ కుడ్య శిల్పంలో గరుత్మంతుడు కాళ్ళను వంచి కుడి చేతిని కుడి కాలు పై, ఎడమ చేతిని ఎడమ కాలిపై పెట్టుకుని ఉండగా శ్రీమహావిష్ణువు గరుత్మంతుని భుజస్కందాలపై ఆసీనులై ఉన్నట్లు మహాద్భుతంగా ఆనాటి శిల్పులు చెక్కారని తెలిపారు. శ్రీ మహావిష్ణువు కుడి వైపు పై చేతిలో సుదర్శన చక్రాన్ని, కిందనున్న చెయ్యి అభయమిస్తున్నట్లు, ఎడమ వైపు పై చేతిలో శంఖం క్రింది చేతిని ఎడమ కాలు పై ఉంచినట్లుగా ఆకర్షినీయంగా చిత్రీకరించారన్నారు. గరుత్మంతునికి, శ్రీమహావిష్ణువుకి కుడివైపు క్రిందగా గజరాజు కాలును మొసలి పట్టుకున్నట్లుగా చెక్కడం ఆనాటి శిల్ప సౌందర్యానికి సజీవ సాక్ష్యమని బొమ్మిశెట్టి వెల్లడించారు.

### నూజివీడు సీడ్స్ లిమిటెడ్ గ్రూప్ వ్యవస్థాపకుడు మండవ వెంకటరామయ్య సంస్మరణ సభలో ఏలూరు ఎంపీ.



**ఏలూరు/(హైదరాబాద్ ),చీఫ్ బ్యూరో అక్టోబర్ 12: నంది పత్రిక** గత నెల సెప్టెంబర్ 22న మరణించిన నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) గ్రూప్ వ్యవస్థాపకుడు మండవ వెంకటరామయ్య సంస్మరణ సభ ఈరోజు " సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్" పేరుతో హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని ప్రధాన్ కన్వెన్షన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మండవ వెంకటరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రైతు బాంధవుడిగా అనేక అవార్డులు, ప్రశంసలు పొందిన మండవ వెంకటరామయ్య 1973లో నూజివీడు సీడ్స్ లిమిటెడ్ స్థాపించారు. మండవ ఫౌండేషన్ ద్వారా పలు స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్న వెంకటరామయ్య రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో కూడా భాగస్వామి అయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గంలోని తన స్వగ్రామం తుక్కులూరుతో పాటు ఆగిరిపల్లి గ్రామంలో పలు పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. మండవ వెంకటరామయ్య నివాళి కార్యక్రమానికి హాజరైన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైతులకు, వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుతం ఎన్ఎస్ఎల్ గ్రూప్ కు సీఎండీగా వ్యవహరిస్తున్న ఆయన పెద్ద కుమారుడు ప్రభాకరరావును ఎంపీ పరామర్శించారు.

# రౌడీషీటర్ లకు, సస్పెక్ట్ లకు కౌన్సిలింగ్





**విజయవాడ చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిదిలోని అన్నీ పోలీసు స్టేషన్ల మరియు టాస్క్ ఫోర్స్ కార్యాలయం లలో అయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిదిలోని రౌడీషీటర్ లకు, లా %డ% ఆర్డర్ మరియు క్రైమ్ సస్పెక్ట్ లకు మరియు చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో,

సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి మరియు ఇతర మత్తు పదార్ధాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.





## జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ఉక్కుపాదం మోపుతున్న జిల్లా పోలీసులు

**గడచిన నెలరోజుల్లో 1200 లకు పైగా కేసులు నమోదు**
**బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘాబహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించబోము**
**జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్**




**బాపట్ల చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ హెచ్చరించారు. గడచిన నెలరోజుల కాలంలో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు వారి పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో నిఘా ఉంచి, డ్రోన్ ల ద్వారా నిశితంగా పరిశీలిస్తూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి, వారి పై కేసులు నమోదు చేయడం జరిగింది. గడిచిన నెలరోజులలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 1200 మందికిపైగా వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరాలు జరగడానికి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం కూడా ప్రధానమైన కారణమని, అంతేకాకుండా దాని వలన సాధారణ ప్రజలకు, మహిళలకు తీవ్రమైన అసౌకర్యం కలుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ మద్యం మత్తులో చిన్న కారణానికి కూడ తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 13 నుండి ఇప్పటి వరకు, కేవలం నెలరోజుల్లోనే 1200 మందికిపైగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మహిళ భద్రత, నేర నియంత్రణే ప్రధాన లక్ష్యంగా బహిరంగ ప్రదేశాల్లో నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. బాపట్ల జిల్లాలోని వాడరేవు, రామాపురం బీచ్, సూర్యలంక తదితర సముద్రతీర ప్రాంతాలకు శని, ఆదివారాల్లో యాత్రికులు అధిక సంఖ్యలో విహారయాత్రలకు వస్తుంటారన్నారు. చుట్టు పక్కల జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చే యాత్రికులు కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడిపేందుకు, ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఉండేందుకు తీరప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలపై డ్రోన్‌ల ద్వారా నిఘా ఉంచి, మద్యం సేవించే వారిని గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు భద్రతాపరంగా మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్న, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయన్నారు. నేర నియంత్రణలో పోలీస్ శాఖకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. అప్పుడే నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్ల లో అధికారులు సమన్వయంతో పనిచేయండి..

### ఉమ్మడిజిల్లాలల నుండి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకూడదు అధికారులకు మంత్రి బీసీ ఆదేశం





**బనగానపల్లె అక్టోబర్ 12నందిపత్రిక** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అంశం పై అక్టోబర్ 16 న భారీ బహిరంగ సభకు వస్తున్న మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో సభా ప్రాంగణానికి వచ్చే ప్రజానీకానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారము ఆయన బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని సభకు బనగానపల్లె నుండే కాకుండా ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజానీకము పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉంది. కనుక సభకు వచ్చిన ప్రజలకు ఆహారము త్రాగునీరు, విద్యుత్తు, మొదలగు సదుపాయాలన్నీ కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశానికి ఎంపిడిఓ, ఏపిఓ, ఏపీఎం, ఎంఏఓ ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా.. సభా వేదికకు ముందుగానే చేరుకునే విధంగా రవాణా ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు.ప్రధాని మోదీ సభకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచారు.

## ప్రధాని సభపై కూటమి నాయకులతో మంత్రి సమీక్ష

**బనగానపల్లె అక్టోబరు 12 నందిపత్రిక** అక్టోబరు 16 న దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఉన్న నేపథ్యంలో ఆదివారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇన్చార్జిలు మరియు బిజెపి, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ పరిశీలకుడు గిద్దలూరు శాసన సభ్యులు అశోక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణల అమలు తర్వాత తొలిసారి ప్రధాని మన కర్నూలు జిల్లాకు రాబోతున్నారు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్ని చూసుకుంటారన్న భరోసాతోనే ముఖ్యమంత్రి కర్నూలు జిల్లాను ఈ సభకు వేదికగా ఎంచుకున్నారు. ప్రధాని సభకు కర్నూలు జిల్లాను ఎంపిక చేయడం గర్వకారణంతో పాటు మన బాధ్యతను మరింత పెంచింది గత ఎన్నికలకు ముందు ప్రకాశం జిల్లా మొత్తాన్ని ముందుండి వెన్నుతట్టి ప్రోత్సహించిన వ్యక్తి జనార్దన్ రెడ్డి నేడు తామంతా ఎమ్మెల్యేలుగా గెలుపొందడంలో ఆయన పాత్ర మరువలేనిది.పార్టీ నిర్దేశించిన లక్ష్యానికి మించి నియోజకవర్గ నుంచి జన సమీకరణ జరుగుతుందని ఆశిస్తున్నాను అధిష్టానం ఆశ్చర్యపడే విధంగా స్థానికంగా ప్రజలు సభకు తరలిరావాలి.గత ఏడాదిన్నర కాలంగా ఆర్ అండ్ బి శాఖ మంత్రిగా ఆయన పాలనలో తనదైన ముద్ర వేశారు అన్నారు. ప్రస్తుతం జీఎస్టీ 2.0 సంస్కరణలు గ్రామ గ్రామాన అమలవుతున్న తీరు చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని అశోక్ రెడ్డి అన్నారు.ఈ సమావేశానికి నియెజకవర్గ స్థాయిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుయ్యారు

### మంచు విష్ణును కలసిన బల్మూర్ వెంకట్... శ్రీకాంత్ అయ్యంగార్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రముఖ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్, జాతిపిత మహాత్మా గాంధీపై సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తీవ్రంగా స్పందించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ('మా') అధ్యక్షుడు మంచు విష్ణును కలిసి, శ్రీకాంత్ అయ్యంగార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం మంచు విష్ణుతో భేటీ అయిన బల్మూర్ వెంకట్, ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. జాతిపితను అవమానించేలా, అసభ్యకర రీతిలో శ్రీకాంత్ అయ్యంగార్ సోషల్ మీడియాలో వీడియో పెట్టారని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. దేశం గర్వించదగ్గ మహనీయుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని, తక్షణమే 'మా' నుంచి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలు,పోలీస్ సహకారంతో ప్రశాంత వాతావరణం లో ఘనంగా ఉత్సవాలు





**సత్యసాయి ట్రస్ట్ సహకారంతో రూ.1కోటి 32 లక్షలతో పుట్టపర్తి లో 91 ప్రాంతాల్లో 216 నిఘా కెమెరాలు , నైట్ డ్రోన్ కెమెరాలు నిఘా నేత్రాలతో పుట్టపర్తికీ పూర్తి రక్షణ బాబా వేడుకల సందర్భంగా సత్యసాయి ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేస్తున్న నిఘా కెమెరాల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ జె రత్నాకర్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

**పుట్టపర్తి చీఫ్ బ్యూరో అక్టోబర్12 నంది పత్రిక** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతి ఉత్సవాలకు సత్యసాయి ట్రస్ట్ సహకారంతో రూ.1కోటి 32లక్షలతో దేశంలోనే పుట్టపర్తిలో అత్యాధునిక సాంకేతిక పరికరాలతో ప్రజలకు రక్షణ కల్పించే ఏర్పాట్లు చేయడం ఎంతో అభినందనీయమనీ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కొనియాడారు. పుట్టపర్తి మున్సిపాలిటీలోని గణేష్ సర్కిల్ లో సత్యసాయి ట్రస్ట్ సహకారంతో గుర్తించిన 91 ప్రాంతాల్లో రూ.1కోటి 32 లక్షలతో నిఘా కెమెరాలు ఏర్పాటుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ జె రత్నాకర్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100 వ జయంతి ఉత్సవాలను ప్రజలు పోలీసుల సహకారంతో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సత్య సాయి ట్రస్ట్ సభ్యులు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రజల రక్షణ కోసం పోలీసులకు అందజేయడం ఎంతో అభినందించేదగ్గ విషయమని సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఆర్ జె రత్నాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ మాసంలో జరిగే బాబా వేడుకలకు పుట్టపర్తి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే విధంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాబా వేడుకలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ తో పాటు ప్రపంచ దేశాల నుంచి గవర్నర్లు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ ప్రముఖులు ఇక్కడికి సుమారు పది లక్షల మందిపైగా భక్తులు ఇచ్చేస్తారని తెలిపారు. అందుకు అనుగుణంగా పుట్టపర్తిలో ప్రజలకు మౌలిక వసతులతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అత్యాధునిక సాంకేతిక పరికరాలు ప్రత్యేకంగా వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసి అను నిత్యం పోలీసులు అపమత్తంగా ఉండేలా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బాబా 100 వ జయంతోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామని అందుకు ప్రతిఒక్కరు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు . మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో 100వ జయంతి ఉత్సవాలను సత్యసాయి ట్రస్ట్ సహకారంతో కూటమి ప్రభుత్వం లో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి పుట్టపర్తి కి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని గుర్తు చేశారు. భక్తులకు పుట్టపర్తిలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రస్ట్ సహకారంతో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచన మేరకు ప్రభుత్వ అధికారులు మౌలిక వసతుల కల్పనకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. బాబా వేడుకల సందర్భంగా పోలీసు యంత్రాంగానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యదర్శి ఆర్ జె రత్నాకర్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, పుట్టపర్తి లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు ,నైట్ నిఘా డ్రోన్లు దేశంలో ఎక్కడ లేవని పేర్కొన్నారు. నవంబర్ మాసంలో జరిగే సత్యసాయిబాబా 100వ జయంతోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎంతో పకడ్బందీగా భక్తుల రక్షణ కోసం పోలీస్ భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగానికి అన్ని విధాలుగా సత్యసాయి ట్రస్ట్ సహకారం ఉంటుందని ట్రస్ట్ కార్యదర్శి రత్నాకర్ తెలిపారు. అనంతరం పుట్టపర్తి చిత్రవతి రోడ్ లో కోటి 20 లక్షలతో నిర్మాణం చేపట్టిన కూడా చిల్డ్రన్స్ పార్కును, స్నానపు ఘాట్స్ నిర్మాణ పనులను మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ డిఎస్పి విజయ్ కుమార్ కూటమి పార్టీల స్థానిక నాయకులు బోయ రామాంజనేయులు సాముకోటి ఆదినారాయణ గంగాధర్ నాయుడు రామారావు ,ఓబులేసు ,బెస్త చలపతి,సురేష్ చౌదరి ,దేవేంద్ర రెడ్డి ,కృష్ణ ప్రసాద్, ఉమాపతి, సుబ్రమణ్యం, కూటమి పార్టీల బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి.




**కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు యమగాని, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని.**
**ముఖ్య అతిథిగా హాజరైన చిలువేరు సమ్మయ్య గౌడ్.**

**కేసముద్రం, అక్టోబర్ 12(నంది పత్రిక):** ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం మానుకోట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న, ముఖ్య అతిథి సమ్మయ్య గౌడ్ లు అన్నారు. మండల కేంద్రంలోని హరిహర గార్డెన్ లో ఆదివారం కేజీకేఎస్ 5వ మండల మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని, గీత కార్మికులకు రావలసిన ఎక్స్ గ్రేషియా 20 లక్షలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఎక్స్ గ్రేషియా నిధులను వెంటనే అందేలా చూడాలని, గీత కార్మికులకు మోటార్ సైకిల్ లను, సేఫ్టీ మోకులను వెంటనే అందజేయాలన్నారు. కల్లుగీత కార్మిక సంఘం మొదటి నుండి చేసిన పోరాటాలను ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలని, అదే స్ఫూర్తిని తర్వాత తరానికి అందించాలని, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలలో ఉన్న గౌడ బిడ్డలు వారి యొక్క సత్తా చాటుకునే రోజులు వచ్చాయని, ప్రతి ఒక గౌడ బిడ్డ కలిసికట్టుగా ఉంటూ కల్లుగీత కార్మిక సంఘం ఐక్యతను ప్రభుత్వానికి చాటి చెప్పేలా చూడాలన్నారు. కేజీకేఎస్ కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ దానిని బలోపేతం చేయడానికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, అదేవిధంగా కేసముద్రం మున్సిపాలిటీలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేలా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుంటానని, ప్రతి గౌడ కుటుంబానికి ఒక కొడుకులా ముందుండి అన్ని విధాలుగా అండగా నిలబడి కాపాడుకుంటానన్నారు. సమావేశం అనంతరం కేసముద్రం మండల కేజీకేఎస్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా బబ్బూరి ఉప్పలయ్య, ఉపాధ్యక్షులుగా మేడి వెంకటేశ్వర్లు, వంగ సంపత్, కార్యదర్శిగా మోడెం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా జోగు రవీందర్, సభ్యులుగా కదిర సోమయ్య, బుర్ర వెంకన్న, రాంపల్లి వెంకన్న, చిరగాని సాయిలు, గడ్డం ప్రభాకర్, గోపగాని వీరన్న, బొమ్మగాని ఎల్లయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గా ముంజాల కుమారస్వామి, కోకన్వీనర్ గా మేంచు వంశీలను ప్రకటించారు.





# హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

**సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు.**
**సిఐటియు అనుబంధ హమాలి కార్మికుల మండల కమిటీ ఎన్నిక.**

**కేసముద్రం, అక్టోబర్ 12(నంది పత్రిక):** ఆదివారం కేసముద్రం మండల కేంద్రంలోని సిఐటియు ప్రజా సంఘాల కార్యాలయంలో హమాలి కార్మికుల మండల కమిటీ సమావేశం కేశబోయిన సంపత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వాలు హమాలి కార్మికుల సమస్యలను విస్మరించాయని, అధికారం లోకి వస్తే హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు చెప్పి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు హమాలి, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, వయసు పైబడిన హమాలి కార్మికులకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కేసముద్రం మండల హమాలి కార్మికుల మండల కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా కేశబోయిన సంపత్, కార్యదర్శులుగా జల్లే జయరాజ్, ఉపాధ్యక్షులుగా కందిపాటి విజేందర్, కోశాధికారిగా కొండ శ్రీను, సహాయ కార్యదర్శులుగా కాలెపాక వంశీ, మాతంగి రాజు, కార్యదర్శి వర్గ సభ్యులుగా పయ్యావుల కొమురయ్య, తండ వీరన్న, బూర యాకయ్య, ఐలయ్య వీరన్న, భాస్కర్, అనిల్ లను ఎన్నుకున్నారు. అనంతరం హమాలి యూనియన్ మండల కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో హమాలి కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాటాలు నిర్వహిస్తామని, ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, సిఐటియు సీనియర్ నాయకులు చాగంటి కిషన్, సోమారపు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పేదల పట్ల గొప్ప మనస్సు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి

**- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ**
**- రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క**



**ములుగు జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 12 ( నంది పత్రిక)** ములుగు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం 48 మంది లబ్ధిదారులకు 63 లక్షల విలువ గల చెక్కులను ములుగు నియోజక వర్గం లోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వములో ప్రైవేట్ హాస్పటల్ లో చికిత్స పొంది ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే ఏడాదిన్నర పట్టేది లక్ష ఖర్చు అవుతే కనీసం 20 వేలు కూడా వచ్చేవి కాదు కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రతి పేదవాడికి చేయూతను అందించాలనే లక్ష్యం తో మన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లక్ష రూపాయలు ఖర్చు అవుతే 40 వేలు తగ్గకుండా వేను వెంటనే నిధులు మంజూరు చేస్తూ పేదల పక్షాన వాళ్లకు ఆర్థిక సాయం అందించడం జరుగుతుంది అని మంత్రి సీతక్క అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డా.మురళీ నాయక్



**కేసముద్రం, అక్టోబర్ 12(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బడి తండాకు చెందిన బానోతు ప్రియాంక-వీరన్నల కుమార్తెలు మోక్ష, పూజశ్రీ ల కర్ణ వేదన కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.భూక్య మురళీ నాయక్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆజ్మీర సురేష్ నాయక్, మార్కెట్ డైరెక్టర్ ఆయూబ్ ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాదావత్ పవన్ కళ్యాణ్ నాయక్, నాయకులు తరాల వీరేష్ యాదవ్, కుమారస్వామి, బాలు నాయక్, విజయేందర్ రెడ్డి, ప్రభు రాణి, గొట్టం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## బంధువులు లేని మృతదేహానికి దైవ సేవగా అంత్యక్రియలు చేసిన మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్



**జమ్మలమడుగు అక్టోబర్ 12 నంది పత్రిక** స్థానిక : జమ్మలమడుగు లో బిక్షయాట న చేస్తూ రఘు వ్యక్తి అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు లేకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రసిడెంట్ అహమ్మద్ హుస్సేన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఈరోజు సాయంత్రం 05:30 లకు హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్, కృప అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు, సురేష్, ప్రసన్న కుమార్ మరియు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు... మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్ధులకు సహాయం చేయదలచిన లిఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా కోరుచున్నాము..82972 53484, 9182244150.

## మాజీ గవర్నర్ పెండెకంటికి ఘన నివాళి

**బనగానపల్లె అక్టోబర్ 12 నందిపత్రిక** దివంగత మాజీ గవర్నర్ పెండెకంటి వెంకట సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం బనగానపల్లెకు చెందిన ప్రపంచ ఆర్య వైశ్య సంఘం ప్రతినిధి టంగుటూరు శీనయ్య ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులార్పించారు. అయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులార్పించి అయన త్యాగనిరతిని కొనియాడారు. ఈ నాడు విద్య, వ్యవసాయ రంగాల్లో అయన స్థాపించిన సంస్థల వల్ల ఎంతోమందికి విద్య, వ్యవసాయ సదుపాయాలు అందుతున్నాయన్నారు. కోయిల కుంట్ల రైల్వే స్టేషన్ రావడానికి ముఖ్య కారకులైన దివంగత మాజీ గవర్నర్ ఆర్యవైశ్య ముద్దుబిడ్డ అని ఆయన కొనియాడారు.



# ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు






**తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి**

**మౌర్య హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ వసీం**

**జలదుర్గం లో ఉచిత వైద్య శిబిరం**

**250 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు మరియు మందులు పంపిణీ**

కర్నూలు నంది పత్రిక..... ఆరోగ్యం పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మౌర్య హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ వసీం అన్నారు. మౌర్య హాస్పిటల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలుష్యం, వాతావరణ మార్పులు, జీవన శైలి లో మార్పుల వల్ల ప్రజలు అనేక రోగాల భారిన పడుతున్నారని అన్నారు. కొన్ని రోగాలు బయట పడితే మరికొన్ని రోగాలు పరీక్షలు చేయించుకుంటే తప్ప బయట పడడం లేదన్నారు. ముఖ్యంగా శారీరక వ్యాయామం లేక పోవడం వల్ల ఊబకాయం, బీపీ, షుగర్ తదితర వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మంచి ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతి రోజు వ్యాయామం తప్పని సరి అన్నారు. అలాగే తరుచుగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఏటా మొత్తం బాడీ పరీక్షలు చేయించుకుంటే మరీ మంచిది అన్నారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ముందస్తుగా చికిత్స తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం సుమారు 250 మందికి ఉచితంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గ్యాస్ట్రో అండ్ జనరల్ సర్జన్ డాక్టర్ వసీం తో పాటు ప్రముఖ కంటి వైద్యురాలు డాక్టర్ సౌజన్య, డాక్టర్ రవి, డాక్టర్ ఇర్ఫాన్ మరియు మౌర్య హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పదికి పాతికేళ్ల వేడుకలు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఎమ్మిగనూరు అక్టోబర్ 12,(నంది పత్రిక) ఎమ్మిగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 1999-2000 సం.లో పదవ తరగతి చదివిన విద్యార్థులంతా కలసి 25సం.ల పూర్వ విద్యార్థుల (సిల్వర్ జూబ్లీ) ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పదికి పాతికేళ్లు అని నామకరణం చేశారు. ఇందులో భాగంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి బ్యాండ్ మేళంతో ఊరేగింపుగా సభ స్థలానికి పూర్వ విద్యార్థులందరూ వారికి పూలు వెదజల్లుతూ స్వాగతం పలుకుతూ తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం ఈ విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుంటూ మైమరచి వారి ఆదిత్యాన్ని స్వీకరించి మంత్రముగ్ధుల య్యారు. గురువులు ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించినందుకు అభినందిస్తూ తమ విద్యార్థులు ఇంకా గొప్పగా పైస్థాయి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం నిర్వహించడానికి కష్టపడిన పూర్వ విద్యార్థుల బృందానికి అభినందించారు. అలాగే విద్యార్థులు గురువులను పూలహారలతో, శాలువాలు మెమొంటోలతో సన్మానించి పాతిక సంవత్సరాల క్రితం ఏ ఏ ఉపాధ్యాయుడు వారితో ఎలా ఉండేవారో వారికి విద్యాబుద్ధులు ఎలా నేర్పించారు అని గుర్తు చేసుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకరిని ఒక రాలింగణం చేసుకుంటూ ఒకరినొకరు గుర్తుపట్టుకుంటూ వారు ప్రస్తుతం ఏ ఏ హోదాలో ఉన్నారో ఒకరినొకరు తెలుసుకుంటూ ఆనందంగా ఉల్లాసంగా ఈ



వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం విద్యార్థులకు కూడా మెమొంటోలను అందజేశారు. పదికి పదికేళ్ల కార్యక్రమంలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సుందరీ బాయి, కోమల దేవి, మాధవీలత, సైదాబాను, నాగేష్, వీరభద్రయ్య, బాలవీరయ్య, లక్ష్మణరావు, సుదర్శన్ రెడ్డి, శ్రీరాములు, రాజా రామ్మోహన్, నాగభూషణ్, రవికుమార్, లతీఫ్, వెంకటేష్, నాగరాజులు, పూర్వ విద్యార్థులు సుమారు వందమందికి పైగా పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటన కు 7,300 మంది పోలీసులతో పకడ్బందీ భద్రత



**కట్టుదిట్టమైన భద్రత**

**భద్రతా ఏర్పాట్ల పై బందోబస్తు నిమిత్తం విచ్చేసిన సెక్టార్ పోలీసు ఉన్నతాధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసిన...**

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**

కర్నూలు నంది పత్రిక.... ఈ నెల 16 వ తేదీన కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టార్ , లైజనింగ్ పోలీసు అధికారులతో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కర్నూలు , ఓర్వకల్లు మండలం , నన్నూరు దగ్గర ఉన్న రాగమయూరి గ్రీన్ హిల్స్ లో బహిరంగ సభ ప్రాంతం దగ్గర ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మాట్లాడుతూ...పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి , జియో గ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ మాట్లాడారు. ప్రధాని పర్యటన నిమిత్తం 7,300 పోలీసు బలగాలను బందోబస్తు కు వినియోగిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. 1) ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఏరియాల నుండి వచ్చే వాహనాలను నాగాలాపురం దగ్గర ట్రాఫిక్ మళ్ళింపు చేయాలన్నారు. బస్తిపాడు, చిన్న టేకూరు , తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. 2) డోన్, ప్యాపిలి, తుగ్గలి, పత్తికోండ ఏరియాల నుండి వచ్చే వాహనాలు నేషనల్ హైవే కు వచ్చి తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. 3) కర్నూలు మీదుగా నుండి వచ్చే వాహనాలు నన్నూరు టోల్ గేట్ దాటి తర్వాత రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. 4) నంద్యాల , ఆళ్ళగడ్డ, బనగానపల్లె ఏరియాల నుండి వచ్చే వాహనాలు నంద్యాల రోడ్డు లో వచ్చి రాగమయూరి పార్కింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి చేరుకునే విధంగా చేయాలన్నారు. ఆయా నియోజక వర్గాల నుండి వచ్చే వాహనాలను ఏవిధంగా పార్కింగ్ ప్రదేశాలకు మళ్ళింపు చేయాలనే విషయాల పై చర్చించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజక వర్గాల వారిగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలలో వారి వాహనాలను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో ఇండికేషన్ సైన్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆఫీసియల్స్ కి నెంబర్ 2 పార్కింగ్ ఏరియా ను కేటాయించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ డైవర్సన్స్ గురించి,



విఐపి కాన్వాయ్ రూట్ , ఏయే నియోజక వర్గాల నుండి ఎంత మంది ప్రజలు వస్తున్నారని, క్రౌడ్ కంట్రోల్ ఏవిధంగా చేయాలనే విషయాల గురించి బందోబస్తు వివరాల గురించి, జియోగ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు . ప్రతి సెక్టార్ ఇంచార్జ్ పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. వివిఐపిల పార్కింగ్, వివి ఐపిల గ్యాలరీల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఎస్పీలు పరమేశ్వర్ రెడ్డి, దేవరాజ్, మాధవ్ రెడ్డి, దీపికా పాటిల్ , జి. కృష్ణకాంత్ , కృష్ణకాంత్ పటేల్, శ్రీనివాసరావు, మణికంఠచందవోలు, దీరజ్ కునుబిల్లి, షెల్కే నచికేత్ విశ్వనాథ్ , చక్రవర్తి, లక్ష్మీనారాయణ, ట్రైనీ ఐపియస్ లు , అడిషనల్ ఎస్పీలు , డిఎస్పీలు , సిఐలు, ఆర్ ఐలు ఎస్సైలు పాల్గొన్నారు.



## నేడు ఎక్సైజ్ ఆఫీస్ ముట్టడి విజయవంతం చేయండి:

**- వైకాపా సమన్వయకర్త ఎస్ఎల్ ఈరలక్కప్ప**



మడకశిర నంది పత్రిక న్యూస్ అక్టోబర్ 12: నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప గుడిబండ మండల కేంద్రంలో వైఎస్ఆర్సిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి కల్తీ లిక్కర్ల గురించి ఎక్సైజ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సొంత జిల్లాలోని కల్తీ మద్యం తయారు చేసే ఫ్యాక్టరీ ఉంది అంటే అతనికి తెలియకుండా ఉంటుందా అని ప్రశ్నించారు దానిపైన ముట్టడి కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలన్నారు నేడు 10 గంటలకు మడకశిర పట్టణం వైయస్సార్ సర్కిల్ లో ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిబి శివకుమార్ మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ డిఎల్ ఎంజారే గౌడ్ సర్పంచ్ జీబీ కరుణాకర్ గౌడ్ అశ్వత్ నారాయణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయ కాపు,బలిజ సత్రం కళ్యాణ మండపం నిర్మాణానికై రూ.4 లక్షలు విరాళంగా అందజేసిన.. అధ్యక్షుడు శెట్టి విజయకుమార్

**- కమిటీ సభ్యులకు తల్లి జ్ఞాపకార్థంగా అందించిన చెక్..**



ఆళ్లగడ్డ, ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం అక్టోబర్ 12 నంది పత్రిక లోని శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ, నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయ్ కుమార్ తన తల్లి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థంగా నాలుగు లక్షల కళ్యాణ మండపం నిర్మాణానికై విరాళంగా అందించారు. ఈ సందర్భంగా సత్రం కమిటీ సభ్యులకు 4 లక్షల చెక్ ను విరాళంగా అందించి విలేకరుల సమావేశంలో శెట్టి విజయకుమార్ మాట్లాడారు. తన తల్లి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సత్రం అభివృద్ధికి ముందు కూడా తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఇందులో భాగంగానే కళ్యాణ నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలను విరాళంగా అందించినట్లు తెలిపారు. ఇటీవల అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చరిత్రపై ఓ చిత్రాన్ని తాను స్వయంగా నిర్మించినట్లు అన్నారు. త్వరలోనే ఆ చిత్రం విడుదల ఉంటుందన్నారు. స్వామి వారి మహిమలు జీవిత చరిత్ర సనాతన ధర్మం సాంప్రదాయాలను ఈ చిత్రంలో చిత్రీకరించినట్లు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



బనగానపల్లెఅక్టోబర్ 12 నందిపత్రిక బనగానపల్లె నియోజకవర్గం పరిధిలో ఆదివారం జరిగిన శుభకార్యాలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల వైఎస్సార్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్ఆర్ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రామ్మోహన్ రెడ్డి,తదితరులు అయన వెంట ఉన్నారు.

## ప్రధాని పర్యటనలో సమర్థవంతంగా పనిచేయండి

**అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోండి**

**నగరపాలక అధికారులకు కమిషనర్ పి.విశ్వనాథ్**



కర్నూలు నంది పత్రిక... ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా నగరపాలక అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదేశించారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా రహదారుల మరమ్మత్తు పనులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, స్నాక్స్ మరియు హెల్ప్ డెస్క్ ఏర్పాట్లపై పూర్తి స్థాయి దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. అదేవిధంగా నగరంలో సుందరీకరణ, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. విభాగం అధికారులు తమ పనులు సమయపాలనతో పూర్తి చేసి, సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. అలాగే ఇతర నగరాల నుండి వచ్చే మున్సిపల్ ఉన్నతాధికారులు, కమిషనర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వసతి, ఆహారం, రవాణా వంటి అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

## దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభకు రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నాగభూషణం

రాజుపాలెం అక్టోబర్ 12 నంది పత్రిక దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభ సభకు హాజరు అయినటువంటి రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నాగభూషణం మండల విద్యా కార్యాలయ ఆఫీస్ సబార్డినేటర్ యూనియన్ ఈ కార్యక్రమం విజయవాడలోని మాకినేని బసవ పున్నమ్మ ఫంక్షన్ హాల్ లో ఈరోజు జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ సభ్యులు మరియు రాష్ట్ర సభ్యులు అందరూ పాల్గొన్నారు ప్రధాన డిమాండ్లు ప్రభుత్వానికి వివరించడం జరిగింది. ఒకటి సమాన పనికి సమాన వేతనం రెండు హెచ్ఆర్ పాలసీ మూడు ఉద్యోగ భద్రత మొదలైన అంశాలు ఈ కార్యక్రమంలో సవివరంగా చర్చించడం అయినది రాష్ట్ర సలహా సభ్యులు అందరూ అక్కడ పాల్గొనడం జరిగింది రాష్ట్రంలో నంద్యాల నాగభూషణం చేసిన సేవలు గాను చిరు సత్కారం మెమొంటో ఇవ్వడం జరిగింది ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా జేఏసీ చైర్మన్ కాంతారావు గారు గౌరవ సభ్యులు ఏవి నాగేశ్వరావు గారు జనరల్ సెక్రెటరీ శ్రీమతి కళ్యాణి గారు వారి చేతులమీదుగా నంద్యాల నాగభూషణం కు మెమొంటేను ఇచ్చి సత్కరించడమైనది



# అభివృద్ధికి నోచుకోని లక్ష్మీపాలెం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయం

## దాతలు సహకరించాలని ఆలయ కమిటీ వారు గ్రామస్తుల వినతి

బద్వేల్ అక్టోబర్ 12 (నంది పత్రిక): బద్వేల్ మండలం అనంతరాజపురం (లక్ష్మీ పాలెం) లో గ్రామంలో వెలిసి ఉన్నటువంటి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఈరోజు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చాటకొండు సత్య సంజీవ కుమార్ ,బద్వేలు పెద్ద చెరువు నీటి సంఘం మాజీ చైర్మన్ ఒంటె పేరయ్య బద్వేలు పెద్ద చెరువు నీటి సంఘం డైరెక్టర్ గానుగపెంట శ్రీనివాసులు ధర్మకర్తలు ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ఆధ్వర్యంలో మీడియా వారితో మాట్లాడుతూ కడప జిల్లాలో పేరు పొందిన దేవస్థానంలలో ఇది కూడా ఒక మహిమా కలిగిన మరియు పురాతనమైన దేవస్థానం దాదాపు 600 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయులకు సామంత రాజుగా ఉండి సిద్ధపటం కోటను కేంద్రంగా చేసుకొని పాలించిన మట్టి అనంతరాజు చే నిర్మించబడినది అని చరిత్ర ద్వారా తెలుస్తుంది అని అన్నారు ఇక్కడ స్వామి వారు మరియు అమ్మవారు చూచుటకు ఎంతో వైభవంగా మరియు ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు అయితే కాలక్రమంగా ఈ దేవస్థానం యొక్క రథం, పుష్పరణి(కోనేరు), బృందావనం (పూల తోట) వంటగది, యాగశాల మరియు గోశాల మొదలగు కట్టడములన్ని శిలావస్థకు చేరుకున్నామని అన్నారు మరియు ముఖ్యముగా ఇక్కడ సరిమైన ఆర్థిక వనరులు, ఆదాయ వనరులు లేక దేవస్థానం అభివృద్ధి జరగడం లేదు, ఇక్కడ ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసములో బహుళ ద్వాదశి రోజున రథోత్సవం జరుగును. కానీ రథం శిలావస్థకు చేరుకొని గత నాలుగు సంవత్సరాల గా తిప్పుటకు వీలు లేని స్థితికి చేరుతుందని వారు తెలిపారు కావున ఇప్పుడు నూతనంగా ఏర్పడిన వంటి కార్యనిర్వాహకవర్గము, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు నూతన రథము నిర్మించుటకు ప్రణాళిక రూపొందించి దాదాపు



కోటి 20 లక్షలు రూపాయల అంచనా వ్యయంతో నూతన రథం నిర్మించుటకు నిర్ణయించుకొని పనులు ప్రారంభించినారు కానీ నిధుల కొరతతో పనులు నిదానంగా సాగుతున్నావని వారు తెలిపారు మరియు దేవస్థానంలోని పుష్పరణి, ఉద్యానవనము వంటశాల యాగశాల గోశాల మరియు కళ్యాణ మండపము మొదలగునవి అన్నియు నూతనంగా నిర్మాణం చేయుటకు ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు ఇందుకుగాను దాదాపు మొత్తం మూడు కోట్ల రూపాయల అవసరం ఉంటుందని వారు తెలిపారు కావున భక్తదాలు అందరూ విరివిగా విరాళములు ఇచ్చి దేవస్థాన అభివృద్ధిలో పాలు పంచుకొని ఆ దేవదేవుని కృపకు పాత్రులగుదురని కోరడమైనది ఈ కార్యక్రమంలో్శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చాటకొండు సత్య సంజీవ్ కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు కర్ణ మడ కల బినా మాఘం కిషోర్ కుమార్ ,మజ్జారి సుబ్బరాయుడు ఆన గొంది ఓబులేష్, సంపతి వెంకటసుబ్బయ్య, నల్లి నరసింహులు, నాగయ్య , వెంకటసుబ్బయ్య, ఒంటె చిన్న పీరయ్య ,మెంటా ప్రసన్నకుమార్, చెవుల ప్రసాద్, దేవస్థానం మాజీ చైర్మన్ మాఘం శేషయ్య ,చెవుల జయప్రసాద్, నాగయ్య ,చంటి ,విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు కొండపల్లి వెంకట సుభాష్ కుమార్, మాకం సత్యనారాయణ, అనంతరాజుపురం గ్రామ పంచాయతీ నీటి సంఘం మాజీ అధ్యక్షులు ఒంటె శ్రీనివా పేరయ్య ప్రస్తుత నీటి సంఘం డైరెక్టర్ గానుపెంట శ్రీనివాసులు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు లక్ష్మీ పాలెం గ్రామ ప్రజలు హిందూ బంధువులు మరియు ప్రసన్న వెంకటేశ్వర స్వామి స్వామి భక్తులు తదుపరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి ఆ మూడు రోజులు మహిళా ఉద్యోగులకు సెలవులు ఇవ్వండి

### జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యం



కర్నూలు నంది పత్రిక ..... మహిళా ఉద్యోగులకు నెలలో ఆ మూడు రోజులు సెలవులు ఇవ్వాలని జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు . ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ స్త్రీకి ప్రతినెలా వచ్చే ముట్టు అదే విధంగా గర్భం దాల్చినప్పుడు వచ్చే నొప్పులు ఎంతో బాధను ఎదుర్కోవాల్సి వస్తుంది.. గర్భం దాల్చినపుడు ప్రభుత్వపరంగా మహిళా ఉద్యోగులకు సెలవు లు ఉంటాయి. అలాగే నెలసరి ముట్టుకు కూడా కనీసం మూడు రోజులు సెలవు ప్రకటించాలని ఆయన కోరినట్లు తెలిపారు. స్త్రీ పడే వేదన భరించే వాళ్ళకే తెలుస్తుంది ..గతంలో ముట్టు పేరుతో మూడు రోజులపాటు ఏ వస్తువును ముట్టుకోనించేవారు కాదు ..ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహనతో కొన్ని పాటించి విధులను నిర్వర్తిస్తుంటారు కానీ దానివల్ల కలిగే అనారోగ్య సమస్యలు అంతా ఇంత కాదని అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. దయచేసి మహిళ ఉద్యోగులకు నెలసరి ఐచ్చిక సెలవులు ప్రకటించాలని పలు రాష్ట్రాలలో అమలులో ఉంది నా విన్నపాన్ని స్వీకరించి అమలు పరిచేందుకు కృషి చేస్తారని తాను ఆశిస్తున్నాను అని ఆయన తెలిపారు. చాలామంది మహిళలకు ముట్టు సమయంలో ఎక్కువ బాధ ఉంటుందని ఆ నొప్పి నుండి విముక్తి కోసం మందులు వాడటం వల్ల కూడా అనారోగ్యానికి గురి అవకాశం ఉందని ఆయన తెలిపారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం,మరియు కస్తూరిభా గాంధీ విద్యాలయంలో విద్యా సామగ్రి పంపిణీ.




జమ్మలమడుగు అక్టోబర్ 12 నంది పత్రిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కలశాలలో మొక్కలను నాటిన రోటరీ గవర్నర్ యమ్ కె రవీంద్ర మరియు అసిస్టెంట్ గవర్నర్ కె వి మురళి ధర్ రెడ్డి. సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయడమే రోటరీ సంస్థ ధ్యేయం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి. జమ్మలమడుగు పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ శ్రీ యమ్ కె రవీంద్ర గారు మరియు అసిస్టెంట్ గవర్నర్ కెవి మురళి ధర్ రెడ్డి చేతులమీదుగా మొక్కల ను నాటినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మరియు సెక్రటరీ ఈ సంజీవ రాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ యమ్ కె రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిసరాలను కాపాడుకోవాలి అన్నారు.మొక్కలను నాటి భావితరాల భవిష్యత్తుకు బాసటగా నిలవాలి అని అన్నారు. అనంతరం గూడెం చెరువులో ఉన్నటువంటి కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం లో చదువుతున్న విద్యార్థినులకు జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి ని పరీక్ష అట్టలు, కంబాక్స్ పెట్టెలు,పెన్నులను పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్ పాస్ట్ ప్రెసిడెంట్ పాల నాగేశ్వర రెడ్డి,పాస్ట్ సెక్రటరీ పార్థ సారథి పెద్దలు ,రోటరీ సభ్యులు శ్రీనివాసులు,తిరుపతయ్య,సూర్య నారాయణ,శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యేసు కారుణాలయం లో బియ్యం ప్యాకెట్లు,నిత్యావసర వస్తువులు,పండ్లు,బ్రెడ్లుపంపిణీ.



ముద్దనూరు అక్టోబర్ 12 నంది పత్రిక రోటరీ గవర్నర్ ,మరియు అసిస్టెంట్ గవర్నర్ చేతుల మీదుగా బియ్యం ప్యాకెట్లు, పండ్లు ,బ్రెడ్లు పంపిణీ. ముద్దనూరు మండలంలోని యేసు కరుణాలయం అనాథ వికలాంగుల ఆశ్రయంలో జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్లు,కూరగాయలు,పండ్లు,బ్రెడ్లును రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ యమ్ కె రవీంద్ర గారు మరియు వారి సతీమణి యమ్ ఆర్ వేద గారు ,రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కె.వి.మురళి ధర్ రెడ్డి గారి చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ యమ్.కె రవీంద్ర మాట్లాడుతూ రోటరీ సంస్థ ఆధ్వర్యంలో అనేక రకాల సామాజిక ,సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడమే రోటరీ సంస్థ ప్రధాన ఉద్దేశ్యము అన్నారు.ఇందులో భాగంగా యేసు కారుణాలయం లో ఉన్న అభాగ్యులను హక్కున చేర్చుకొని సేవ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.యేసు కారుణాలయం లో ఉన్న అనాథలు కొరకు పాస్టర్ మర్రెడ్డి గారి చేతికి 5000/-ఐదు వేల రూపాయలను రోటరీ గవర్నర్ యం కె రవీంద్ర ఆర్థికంగా వారి అవసరాల ఉపయోగం కొరకు సహాయం చేసారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె వి మురళి ధర్ రెడ్డి గారు మాట్లాడుతూ రోటరీ తరుపున సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.ప్రతి ఒక్కరు సమాజంలో ఉన్న అనాథ వృద్ధులకు,వికలాంగులకు మానవతా దృకృథంతో సేవ చేయాలని కోరారు.తదుపరి ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మరియు జమ్మలమడుగు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తన నిజ జీవితంలో తన కున్న దానిలో ఆపదలో ఉన్న వారికి,అనాథలకు, మానవతా విలువలు కలిగి సేవ చేస్తే మంచి పుణ్యం వస్తుంది అన్నారు.ఆకలితో ఉన్న వారిని హక్కున చేర్చుకొని వారికి ఆకలి నింపితే వారి ఆశీస్సులతో మనకు నిజమైన సంతృప్తి కలుగుతుంది అన్నారు.ప్రతి ఒక్కరు ఏదో ఒక సందర్భంలో ఇలాంటి వారికి సహాయ పడాలని కోరారు.రోటరీ క్లబ్ అంటే సేవ కు ప్రతి రూపం అన్నారు.సమాజంలో అనేక సందర్భాల్లో ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించి సమాజంలో ఉన్న అనాథలకు,అభాగ్యులను హక్కున చేర్చుకొని వారికి సేవ చేయడమే రోటరీ ప్రధాన ఉదేశ్యం అన్నారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ మరెడ్డి మాట్లాడుతూ మంచి మనస్సుతో వచ్చి సహాయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది.తదుపరి యేసు కారుణాలయం తరుపున రోటరీ గవర్నర్ గారికి,రోటరీ క్లబ్ జమ్మలమడుగు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్, రోటరీ ట్రెజరర్ యమ్.ఓబుల్ రెడ్డి,సభ్యులు శ్రీధర్ రెడ్డి మరియు యేసు కారుణాలయం సిస్టర్స్,సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా జిల్లాలో అక్టోబర్ 13 వ తేదీ ( సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి..



కర్నూలు నంది పత్రిక......అక్టోబర్ 13 వ తేదీన సోమవారం జిల్లాలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.. జిల్లా అధికారులు, ఉద్యోగులు ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైనందున జిల్లాలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం రద్దయిందని, ప్రజలు ఈ విషయం గమనించగలరని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## అహోబిల మఠం 46వ పీఠాధిపతికి ఘనంగా వీడ్కోలు...




ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక ఆళ్లగడ్డ మండలం అహోబిలం క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్రోత్సవాలలో పాల్గొనేందుకు గత 10 రోజుల క్రితం అహోబిలం విచ్చేసిన మఠం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి పవిత్రోత్సవాలు ముగియడంతో ఆదివారం చెన్నైకి తిరుగు ప్రయాణ మయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రీ స్వామి వాహనానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



## విజయవాడలో జరుగు గ్రామ సేవకుల మహా ధర్నాను జయప్రదం చేయండి




ఆదోని ప్రతినిధి, అక్టోబర్ 12, నంది న్యూస్: విజయవాడలో ఈనెల 15వ తేదీన జరుగు గ్రామ సేవకుల మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గ్రామ సేవకుల సంఘం గౌరవ అధ్యక్షులు బి రామాంజనేయులు కోరారు. విజయవాడలో ఈనెల 13 14 తేదీలలో దీక్షలు 15వ తేదీన మహా ధర్నా జయప్రదం కొరకు ఆదోని సిఐటియు కార్యాలయం దగ్గర గ్రామ సేవకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అధ్యక్షతన విసతృ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పే స్కేల్ అమలు చేయాలని కోరారు నైట్ డ్యూటీ లను రద్దు చేయాలని డి ఏ లను జీతం లో కలపాలని నామినీ లను వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు %ఎ% వీఆర్వో అటెండర్ వాచ్మెన్ రికార్డ్ అసిస్టెంట్ తదీతర పోస్టులలో 70 శాతం వీఆర్ఏలకు కేటాయించాలని డిమాండ్ చేశారు డిమాండ్ల సాధన కొరకు జరుగుతున్న ఆందోళనలో వీఆర్ఏలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ సమావేశంలో కోసిగి మండలం నాయకులు రాజు శాంతి, కౌతాళం మండల నాయకులు నాగరాజు, పెద్ద కడుబూరు మండల నాయకురాలు హైమావతి, గోనెగండ్ల మండలం నాయకులు రంగన్న, హొళగుంద మండల నాయకులు తిక్కప్ప తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పై ఆరోపాలు తగవు



అమరాపురం నంది పత్రిక న్యూస్ అక్టోబర్ 12: అమరాపురం మండల పరిధిలోని హేమావతి గ్రామ పంచాయతీ సర్పంచ్ తిప్పేస్వామి మరియు నాయకుల తరపున విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో వైఎస్ఆర్సిపి అధికారంలో ఉన్నప్పుడు స్వలాభం పొందినటువంటి వ్యక్తులు నేడు టిడిపిలో చేరి వారి డైరెక్షన్లో నటన చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి నమ్మకం ఉండడంతోనే నేడు రాష్ట్ర వైఎస్సార్సీపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపిక చేయడం జరిగిందని, మీలాంటి కుళ్ళు కుతంత్రాలు అతనికి ఏమి చేయలేవని జోష్యం చెప్పారు. అదేవిధంగా ఆయనను ఎంపిక చేసినందుకు వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు హేమావతి వైకాపా నాయకుడు, సర్పంచ్ తిప్పేస్వామి పేర్కొన్నారు.

# స్మశాన వాటికకు వెళ్లేందుకు వంతెన సౌకర్యం కల్పించాలి



ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక ఆళ్లగడ్డ మండలం జి. జంబలదిన్నె గ్రామంలో స్మశాన వాటికకు రహదారి సౌకర్యం లేకపోవడంతో ఎవరైనా మరణిస్తే ప్రజల బాధ వర్ణనాతీతంగా ఉన్నత ఉంది. గ్రామంలో ఉధృతంగా ప్రవహించే వక్కిలేరు నీటి ప్రవాహంలో శవాన్ని మోసుకుంటూ ఈదుకుంటూ వెళ్లి అంత్యక్రియలు జరపాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన గుర్రం భూషణం మన వ్యక్తి మరణించగా ఆదివారం గ్రామస్తులు శవాన్ని స్మశాన వాటికకు తీసుకొని వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం వెంటనే చిన్న వక్కిలేరు పై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



కొత్తపల్లి - నంది పత్రిక : ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల బృందం ఆదివారం ఇటీవల గుండెపోటుతో అకాల మృతి చెందిన తమ చిన్ననాటి స్నేహితుడు కలుబండి వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.1,10,000/- ఆర్థిక సాయం చేశారు.ఈ సందర్భంగా కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామంలో మృతుడు వెంకటయ్య భార్య, కుమారులకు కలిసి ఆర్థిక సాయం మొత్తం రూ.1,10,000/- నగదును పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం స్నేహితుడితో తమకున్న గత స్మృతులను గుర్తు చేసుకుని, అతని మంచితనాన్ని కొనియాడారు.

## బొజ్జావారిపల్లెలో ఓటు చోరీ కార్యక్రమం

### ఓటర్ల హక్కుల పరిరక్షణకై ప్రతి ఇంటి వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఇర్ఫాన్ భాష.



ప్రొద్దుటూరు అక్టోబర్ 12 నంది పత్రికఈ రోజు ప్రొద్దుటూరు మండలం బొజ్జావారిపల్లెలో ఓటు చోరీని అరికట్టాలని సంతకాలు సేకరించిన ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా.ఈ సందర్భంగా స్థానికులు ఘనంగా స్వాగతించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు పార్టీకి చేరుస్తానని హామీ.ప్రజల స్వరం వినిపించని పాలన ఇదే అని ఇర్ఫాన్ భాష తీవ్ర వ్యాఖ్యనించారు. ప్రజాస్వామ్య విలువల కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తుందని ప్రజలకు భరోసా ఇచ్చారు.స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని సంతకాల సేకరణలో భాగస్వాములయ్యారు.మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల సమస్యలు కేంద్ర నిర్లక్ష్యం కారణమని ఆరోపించారు.రాహుల్ గాంధీ, షర్మిల రెడ్డి పిలుపుతో కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ప్రజలకు వివరించారు ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రెటరీ అప్పపోగులు ఎల్లయ్య, గౌస్, ఖలందెర్, రమణ రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ లో అధికారుల అలసత్వం .. కార్గో నిర్వాహకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది..



మైదుకూరు అక్టోబర్ 12 నంది పత్రికమైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి రైతులు కూరగాయలు, ఆకుకూరలు ,పూలు తదితర వస్తువులు వందల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. హైదరాబాదు ,విజయవాడ ,విశాఖపట్నం తదితర ప్రాంతాలకు మైదుకూరు ఆర్టీసీ డిపో నుండి సరుకులు తరలించడం ప్రతిరోజు జరిగే పని..సజావుగా సాగుతున్న క్రమంలో ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంతో మొదలైన సమస్య..ఆర్టీసీ స్థలంలో అనేక దుకాణాలు ఇతర ఫంక్షన్ హాల్ లీజుకు తీసుకొని నిర్మించుకున్నారు..ఆ మధ్యలోనే ఆర్టీసీ కార్గో ఉండడంతో అక్కడనుండి బస్సులకు పార్సెల్లను తరలించేందుకు నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు సాయంత్రం సమయంలో వస్తుంటాయి...వాహనాలను దుకాణాల ఎదుట నిలబెట్టడంతో దుకాణదారులకు రైతులకు మధ్య సమస్య ఏర్పడింది..తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇతర వాహనాల ను ఉంచరాదని దుకాణదారు ఆంక్షలు పెట్టారు..ఆర్టీసీ అధికారులు కార్గోను ముందుగానే విశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య మొదలైందని రైతులు వాపోతున్నారు..మైదుకూరు ఆర్టీసీ డిపోకు రోజుకు 80నుండి లక్ష రూపాయలు ఆదాయం ఇస్తున్న మాకు అసౌకర్యం కల్పించడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు..కార్గో సర్వీస్ నిర్వాహకుడు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నాడని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఅంతేకాకుండా రాత్రి సమయాలలో పార్సల్ తీసుకొని వచ్చిన వాహనాలు నిలబడి ఉండడంతో బస్సులు తిరిగేందుకు కూడా స్థలం లేక డ్రైవర్లు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది..ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం కూడా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు..తక్షణమే ఆర్టీసీ అధికారులు కార్గో సర్వీసెస్ వల్ల రైతులకు ఏర్పడుతున్న సమస్యను పరిష్కరించాలి అని రైతులు వినియోగదారులు కోరుతున్నారు. ఆర్టీసీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఉమ్మడి జిల్లా లో ఈ పరిస్థితి ఉండటం గమనార్హం. .చొరవ చూపి సమస్య పరిష్కారం చేయాలనీ రైతులు వ్యాపారులు కోరుతున్నారు.

## "జీవ పరిణామం నిరంతర ప్రక్రియ"...

### "మానవాళి అంతా ఒక్కటే అని సైన్స్ చెబుతోంది"....



కర్నూలు నంది పత్రిక.....జీవ పరిణామం అన్నది నిరంతర ప్రక్రియని మనిషి మూలాలన్నీ ఆఫ్రికన్ నుంచే బయలుదేరి కొన్ని వందల వేల సంవత్సరాలు తరువాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయని జెవివి నాయకులు జనరల్ సర్జన్ డాక్టర్ కాలేషా భాష అన్నారు. నగరంలోని బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్ నందు వైద్య విద్యార్థులకు జరుగుతున్న రెండు రోజుల హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నందు ఆయన జీవపరిణామం గురించి వివరించారు. సైన్స్ ప్రపంచ మానవాళి మూలం ఒకచోట నుంచే బయలుదేరిందని ఇది అందరూ ఒకటేనని శాస్త్రీయ ఆధారాలతో చెబుతుంటే కులాలు, మతాలు ప్రాంతాల పేరుతో ప్రజలు విడదీయ బడుతున్నారని తెలిపారు. మనుషులు కులాలు, మతాలు ప్రాంతాలు వారగా విడిపోవడం అందులో మాత్రమే పెళ్లిళ్లు చేసుకోవడం ద్వారా మానవాళి జీన్స్ అక్కడక్కడే తిరుగుతూ అభివృద్ధి చెందడం లేదని ఇది దేశానికి కూడా నష్టం చేస్తుందని తెలిపారు. డాక్టర్ బి బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు పాపం ప్రయోగశాలగా మారి వైద్యులకు వైద్యం నేర్పిస్తున్నారని అందువలన రోగులను గౌరవంగా చూడాలని అన్నారు సమాజంలో కార్పొరేట్ శక్తులు వైద్య రంగంలో కూడా విచ్చలవిడిగా వస్తున్నారని సామాన్యులకు అందుబాటులో ఉండే చిన్న ఆస్పత్రులు వీరి దెబ్బకు విలవిలాడుతున్నాయన్నారు. వివిధ వైద్య కళాశాల నుంచి విచ్చేసిన వైద్య విద్యార్థులకు కుట్లు, వైద్య పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితులను గుర్తించటం ఆ సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం వారిచే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి సురేష్ కుమార్, జనరల్ సెక్రటరీ శేషాద్రి రెడ్డి,రాష్ట్ర నాయకులు మహమ్మద్ మియా గోపాల్ నాయక్ రమణయ్య, శ్రీరాములు, ధనుంజయ్, మీనా, భాష ,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగా పోటీలలో ధన ధీరజ్ కు మూడవ స్థానం



కర్నూలు నంది పత్రిక.... ఈనెల 9 తేదీ నుంచి 12 వ తేదీ వరకు మైసూర్ లోని గణపతి సచ్చితానంద స్వామి ఆశ్రమంలో జరిగిన 50వ జాతీయస్థాయి సీనియర్ యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ నందు కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఫ్రీ ఫ్లో డాన్స్ భాగంలో పాల్గొని మూడో స్థానం సాధించినట్లు రాష్ట్ర కార్యదర్శి అవినాష్ శెట్టి తెలిపారు.ఈ సందర్భంగా ఏషియన్ యోగ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ అగర్వాల్, యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అభినవ్ జోషి చేతుల మీదుగా ప్రశంస పత్రాలతో పాటు మెడల్స్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముంతాజ్ బేగం,ప్రధాన కార్యదర్శి మునిస్వామి తో పాటు ఉపాధ్యక్షులు శ్రీనివాసులు,సాయి కృష్ణ, కోశాధికారి విజయ్ కుమార్ లు అభినందనలు తెలిపారు.

## 14న ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆశాల ధర్నాను జయప్రదం చేయండి




కడప చీఫ్ బ్యూరో అక్టోబర్ 12,నంది పత్రిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని డాక్టర్ల సమస్యలను పరిష్కరించి, డాక్టర్లు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం విరమింపజేయాలని, అలాగే ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14వ తేదీ మంగళవారం కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) కడప జిల్లా సమితి పిలుపుమేరకు ఆశా కార్యకర్తలు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవా ధ్యక్షులు గుంటి వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు యు. మరియమ్మ పిలుపు నిచ్చారు. ఆదివారం ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లు వారి సమస్యల పరిష్కారం కోసం పది రోజులపాటు ఆందోళన చేసి విజయవాడ ధర్నా చౌక్ లో నిరాహార దీక్షలు చేస్తున్న డాక్టర్ల సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తలకు మెరుగైన వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.సర్వీస్ లో ఆశా కార్యకర్త మరణిస్తే 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఆశా కార్యకర్త ఉద్యోగం ఇవ్వాలని,మట్టి ఖర్చులకు 25 వేల రూపాయలుఇవ్వాలని, 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఉచితంగా కల్పించాలని, జీతాలు పెంచాలని, కనీస వేతనం 26, వేల రూపాయలు ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, ఇతర డిమాండ్ల సాధన కోసం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో కడప , కమలాపురం నియోజకవర్గాలలోని ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నానికి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని లేనియెడల ఏపీ ఆశా వర్కర్ యూనియన్ ప్రత్యక్ష ఆందోళన చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తక్షణం ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంనిర్వహిస్తామని తెలిపారు.

## పదవ తరగతిలో ప్రతిభ చాటిన గీత కార్మికుల విద్యార్థులకు స్కాలర్షిప్పు పంపిణీ



రాజమండ్రి చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి త్యాగరాజు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన పదో తరగతిలో ప్రతిభ చాటిన గీత కార్మికుల విద్యార్థులకు స్కాలర్ షిప్ ల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసం శెట్టి సుభాష్ ,కందుల దుర్గేష్ తో కలిసి పాల్గొన్న రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత టీడీపీతోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపు లభించిందని బీసీల విద్యకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్న మంత్రి సవిత. అంతకు ముందు మంత్రి సవితను నిర్వాహకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటి గురుమూర్తి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంతకుమారి, వివిధ కార్పొరేషన్లకు పలువురు డైరెక్టర్లు, టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు, భారీగా భారీ సంఖ్యలో గీత కార్మికులు సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.





## ప్రధాని మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్



కర్నూలు, నంది పత్రిక.....ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు..ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్ గేట్ దగ్గర ఉన్న రాగమయూరి వద్ద సభ ప్రాంగణం ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు..ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు ఈ నెల 16వ తేదిన శ్రీశైలం దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభకు రానున్నారన్నారు.. సభకు హాజరవడంతో పాటు వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్ట్ ల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు.. ఇప్పటికే ఏర్పాట్లు అని కూడా దాదాపుగా పూర్తి అయ్యాయి అన్నారు... ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతంగా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.. మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు..



## దీపావళి కి ముందే విద్యుత్ కాంతి వెలుగులు:

### 15 స్తంభాలకు పైగా నూతన విద్యుత్ బల్బులు: గ్రామ సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప:



శిరివెళ్ళ:-(నంది పత్రిక)మండల పరిధిలోని కోటపాడు గ్రామపంచాయతీలో సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప అది వారం విద్యుత్ స్తంభాలను తనిఖీ చేసి చెడిపోయిన విద్యుత్ ఎల్ఈడి బల్బులకు మరమ్మత్తులు చేయించి పనికిరాని ఎల్ఈడి బల్బులను తీసివేసి నూతన బల్బులను వేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ దూదేకుల హుస్సేన్ బి గుర్రప్ప లు అన్నారు. గ్రామాన్ని మెయిన్ బజారు లో మరియు ఎస్సీ కాలనీ మరియు బీసీ కాలనీలలో, వీధి దీపాలను తనిఖీ చేసి నూతన ఎల్ఈడి బల్బులను వేయడంతో దీపావళికి పండుగ వారం రోజుల ముందే దీపావళి వెలుతురుగా ఉందని గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ లోని పలు వార్డులలో వీధుల లో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు కేబుల్ తదితర మరమ్మత్తు సమస్యలు ఎదురు కావడంతో దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు వారం రోజులు ముందే విద్యుత్ వెలుగులు గ్రామంలో విరజిమ్మే లా తక్షణ చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ డి గుర్రప్ప పేర్కొన్నారు.గ్రామపంచాయతీ నిధులు లేకున్నా సొంతనిధుల తో గ్రామ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వీధులలో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా డి హుస్సేన్ బి గుర్రప్ప మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రతి వాడ ప్రతి వీధిలో చివరి గడప వరకు విద్యుత్ వెలుగులు విరజి మ్మేళ తక్షణ చర్యలు చేపట్టి నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న వాతావర ణంలో మార్పు సంబంధించి నందున క్రిమి కీటకాలు విషసర్పాల సంచారం అధికంగా ఉంటుందని గ్రామ ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి చెత్తా చెదారం నివాస ప్రాంతాల్లో నిలువ ఉండకుండా అప్ర మత్తంగా జాగ్రత్తగా ఉంటూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య మెలకు వలను పాటించాలని సర్పంచ్ డి హుస్సేన్ బి గుర్రప్ప తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం మనోహర్, సీనియర్ నేత వంకదార పెద్ద సుబ్బు సత్యనారాయణ, ఇతర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



కొత్తపల్లి - నంది పత్రిక : గుండెపోటుతో మృతి చెందిన చిన్ననాటి స్నేహితుడు కులుబండి వెంకటయ్య కుటుంబానికి తోటి స్నేహితులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990–91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల బృందం ఇటీవల మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన తమ చిన్ననాటి స్నేహితుడు కలుబండి వెంకటయ్య గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో తోటి స్నేహితులు కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య పుస్తేల మణెమ్మకు. కుమారులకు రూ.1,10,000 ఆర్థిక సాయం పూర్వ విద్యార్తులు అందజేశారు.

## మహిళల వరల్డ్ కప్: అంత స్కోరు చేసినా ఓడిపోయిన భారత్

మహిళల ప్రపంచకప్‌లో భాగంగా విశాఖపట్నం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు భారత జట్టుపై 3 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. భారత బ్యాటర్లు అద్భుతంగా రాణించి 331 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ, ఆసీస్ కెప్టెన్ అలిస్సా హీలీ (142) ఆకాశమే హద్దుగా చెలరేగి నమోదు చేసిన విధ్వంసక సెంచరీ ముందు టీమిండియా పోరాటం సరిపోలేదు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణయానికి సవాలు విసురుతూ భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ఓపెనర్లు స్మృతి మంధన (66 బంతుల్లో 80), ప్రతిక రావల్ (96 బంతుల్లో 75) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో బలమైన పునాది వేశారు. అనంతరం వచ్చిన హర్లీన్ డియోల్ (38), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22), జెమీమా రోడ్రిగ్స్ (33),

# విశాఖకు పెద్దఎత్తున పెట్టుబడులు తరలి వస్తున్నాయి







## ఇందుకు కావాల్సిన మౌలిక వసతులపై దృష్టిసారించాలి మౌలిక వసతుల కల్పన కోసం నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించండి ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం

**విశాఖపట్నం: చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** రాబోయే కాలంలో విశాఖ రీజియన్ లో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇందుకు కావాల్సిన మౌలిక వసతులపై నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో విశాఖ కలెక్టరేట్ మీటింగు హాల్ లో మంత్రి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. విశాఖపట్టణం, అనకాపల్లి, విజయగరం, శ్రీకాకుళం జిల్లాలతో కూడిన రీజియన్ అభివృద్ధి, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని విశాఖపట్నం దశాదిశ మారేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. బెంగళూరు, పుణెలాంటి నగరాల్లో ఉండే ట్రాఫిక్ సమస్యలు ఇక్కడ ఉత్పన్నం కాకుండా చూడాలని, విస్తారమైన రోడ్లను అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖకు పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. దానికి తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలి. ముప్పై ఏళ్ల భవిష్యత్తును ఊహించి ప్రణాళికలు రూపొందించాలి. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో కూడిన మేధోపరమైన చర్చ జరగాలని మంత్రి పేర్కొన్నారు. వివిధ కంపెనీలు, అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతున్న ఈ రీజియన్ లో 5 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాబట్టి ఇక్కడి నేతలు, అధికారులు నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేని విధంగా మిషన్ మోడ్ లో అభివృద్ధి జరగాలని, వారి ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో విశాఖ రీజియన్ లో ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు అనువైన ల్యాండ్ బ్యాంకులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్, శాసన సభ విప్ గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండిబాబ్జీ, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు విజయ కృష్ణన్, రాంసుందర్ రెడ్డి, స్వప్నిల్ దినకర్ పుండర్కర్, వీ.ఎం.ఆర్.డీ.ఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, విశాఖపట్నం జేసీ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.







# గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం

## నాడు ఐటీ రంగానికి హైదరాబాదు మార్గదర్శిగా ఎలా నిలిపారో నేడు ఏఐ డిజిటల్ టెక్ రంగాని ప్రపంచానికి చంద్రబాబు నిలుపనున్నారు. విశాఖకు గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచ స్థాయిలో అవకాశాలు ..... తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్

**అమరావతి చీఫ్ బ్యూరో అక్టోబర్ 12. నంది పత్రిక** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం నవ్యాంధ్రప్రదేశ్ కు శుభపరిణామమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు అమరావతిలో ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ. ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు తీసుకువచ్చి హైదరాబాద్ ను ఏ విధంగా అభివృద్ధి చేశారో, నేడు విశాఖకు గూగుల్ ను తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాని మార్చనున్నారని ఆయన తెలిపారు రాష్ట్రాభివృద్ధికి దోహదపడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించి గూగుల్ సంస్థను విశాఖకు తీసుకువస్తున్నారని ఆయన తెలిపారు ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలతో భేటీ అయ్యి, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చి, స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు సృష్టించి, ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చంద్రబాబు గారు చేస్తున్న కృషి ఫలితాలను ఇస్తున్నాయని ఆయన తెలిపారు. విశాఖకు గూగుల్ రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచేలా ఉందని ఆయన చెప్పారు. దేశంలోనే అత్యుత్తమమైన 26 పాలసీలను రూపొందించి సంస్థల నిర్మాణానికి వేగంగా అనుమతులు, భూముల కేటాయింపు నుంచి పవర్ సప్లై వరకు ఒక్క అడ్డంకి లేకుండా సింగిల్ విండో క్లియరెన్స్ అందిస్తున్నామని పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, సమర్థవంతమైన నాయకత్వం ఉండడంతో రాష్ట్రానికి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడులు కంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే వచ్చిన పెట్టుబడులు అధికంగా రావడం జరిగిందని ఆయన తెలిపారు ఈ 16 నెలల్లోనే రాష్ట్రానికి 11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయని ఆయన తెలిపారు గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందనున్నాయని యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా, వారి అభివృద్ధికి బాటలు వేసేలా, యువతను ఒక బలమైన శక్తిగా మార్చేందుకు ఇటువంటినాయుడు సంస్థలను రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు తీసుకువస్తున్నారని ఆయన తెలిపారు అధునాతన టెక్నాలజీని విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు అందించాలని అందించాలని నైపుణ్య శిక్షణ కేంద్రాలతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుండి పాఠ్యాంశాల్లో ఏఐ పాఠాన్ని చేర్చనున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తూ మొన్న అమరావతికి క్వాంటం వ్యాలీని తీసుకుకొచ్చి, నేడు విశాఖకు



గూగుల్ ను తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు ఇవి రాష్ట్రాభివృద్ధికి పెద్ద ఎత్తున దోహదపడుతాయని ఆయన తెలిపారు హైదరాబాద్ లో మైక్రోసాఫ్ట్ రావడంతో టెక్ అభివృద్ధికి ఎలా గేమ్ చేంజర్ అయిందో. అలా ఇప్పుడు గూగుల్ విశాఖపట్నం రావడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అభివృద్ధి కి గేమ్ చేంజర్ గా మారనుందని ఆయన తెలిపారు. రూ 55 వేల కోట్ల పెట్టుబడితో సౌత్ ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ ను నిర్మించబోతున్నట్టు ఆయన తెలిపారు ఇది రాష్ట్రాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు దీంతో సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ నగరం నేడు ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారనుందని ఆయన తెలిపారు పెట్టుబడిదారులను ఆదుకునేందుకు దుష్టశక్తులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరం కాదని ఆయన తెలిపారు నాడు ఐటీ రంగానికి హైదరాబాద్ మార్గదర్శిగా ఎలా నిలిపారో. నేడు ఏఐ డిజిటల్ టెక్ రంగానికి మార్గదర్శిగా ఏపీని మరోసారి ప్రపంచానికి చంద్రబాబు గారు నిలపనున్నారని పాతర్లరమేష్ తెలిపారు

# చెస్ క్రీడ లో రాణించి జిల్లా కీర్తిని చాటండి

## శ్రీకాకుళం నగర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ లో ఉత్సాహంగా జాతీయ చెస్ దినోత్సవ చెస్ టోర్నీ

**శ్రీకాకుళం చీఫ్ బ్యూరో అక్టోబర్ 12 నంది పత్రిక** శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు చెస్ క్రీడలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని, తద్వారా జిల్లా కీర్తిని చాటాలని శ్రీకాకుళం నగర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి అకాంక్షించారు. శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో గల స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీలో జాతీయ చెస్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం చెస్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. 5 రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీలలో చిన్నారులు అసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న శ్రీకాకుళం నగర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి మాట్లాడుతూ. చదరంగం క్రీడ మేధావుల క్రీడ అని, అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని చెస్ ను నేర్చుకోవడం, పోటీలలో రాణిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ సంస్థ గడిచిన 16 సంవత్సరాలుగా శ్రీకాకుళం సిటీలో 206 చెస్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలో ఎంతో మంది ఎన్నో కళలలో రాణిస్తూ జిల్లాకు ఎంతో పేరు తెస్తున్నారని తెలిపారు. ఆనంతంర అయన విజేతలకు మెమొంటోలు, మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి దుర్గా ట్యూషన్ సెంటర్ ప్రతినిధులు, స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ చెస్ కోచ్ లు భేరి చిన్నారావు, కె సాయి నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలగా.. జె.శ్రీసుహాస్ టోర్నీ విజేతగా నిలవగా రన్నరప్ గా ఎ.రోచిర్మయి సత్తా చాటింది. బి.జయంత్ 3వ స్థానంలో నిలిచాడు. తరువాత స్థానాలలో విజేతలగా జి.యశ్వంత్ ప్రతాప్, కె. విజయ్ దర్శిత్, ఆర్.పవన్ కుమార్, బసవ కార్తికేయ, సదాశివుని దివ్యేష్, బి. భువన్, ఆర్. బూపేష్, బి.కుశాల్, జె.శ్రీమాన్, ఎం. లసిత్, ఎ.రుశ్వంత్, బి.మానస్వి, డి. రూస్వెల్ట్, ఎ. లీలామయి, బి. లిఖిత్, బి. లలిత్అదిత్య, ఎన్.సాయికౌశిక్, ఎన్.ప్రసన్నకుమార్, వి.స్వరూప్, కె.నీర్రామ్ మాన్విత్, పి. ధనిష్చంద్ర, ఎ.సహస్ర నిలిచారు.



# నూతన వధూవరులు సంజీవ్ కుమార్ స్మిత ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ





**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 12 నంది పత్రిక** రుద్రవరం మండలం నరసాపురం సమీపంలోని జి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం నాడు టిడిపి సీనియర్ నాయకుడు ముకుందాపురం సంజీవరా యుడు కుమారుని వివాహనికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరై నూతన నూతన వధూవరు లను ఆశీర్వదించారు. అంతకుముందు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కు, కోరే సంజీవ రాయుడు ఎమ్మెల్యే పి ఆర్ ఓ కోరే ప్రసాదు బంధువులు నిర్వాహకులు టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కళ్యాణ మండపంలో మంగళ వాయిద్యాలు వేద మంత్రాల మధ్య నూతన వధూవరులు కోరే సంజీవ్ కుమార్ స్మిత వివాహం ఘనంగా జరిగింది. అనంతరం నూతన వధూవరులు ఎమ్మెల్యేభూమా అఖిలప్రియ ఆశీర్వాదాన్ని అందుకున్నారు. వివాహ వేడుకలకు రాజకీయ నాయకులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు మీడియా సోదరులు తదితరులుపెద్ద సంఖ్యలో



# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవాలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల ప్రస్తానని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొత్తపల్లి మండలం గోకవరం గ్రామంలో ఉన్న భక్తకన్నప్ప గురుకుల ఆవాసం నందు ఆదివారం శతాబ్ది ఉత్సవాలకు ఆర్ఎస్ఎస్ విభాగ్ భౌదికే ప్రముఖ్ విప్రా నారాయణ ఆచారి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్త మాట్లాడుతూ మాట్లాడుతూ 1925 అక్టోబర్ 25 విజయదశమి రోజున డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్ ని స్థాపించారని, అప్పటినుంచి నిరంతరాయంగా దేశభక్తి సామాజిక సమగ్రతను ప్రపంచానికి విస్తరిస్తూ, విపత్తుల నుండి ప్రజలను రక్షిస్తూ, భారతదేశ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో నిస్వార్థత లేకుండా వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. దేశ రక్షణలో ఆర్ఎస్ఎస్ ఎప్పుడు కూడా ముందుంటుందని గుర్తు చేశారు. వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని నేడు లక్షలాది స్వయంసేవకులను తయారు చేసుకున్న ఏకైక స్వచ్ఛంద సంస్థ ఆర్ఎస్ఎస్ అని కొనియాడారు. ఈ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పంచ పరివర్తన్ పేరుతో సమాజ ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. ఇందులో స్వయం సేవకులందరూ భాగస్వాములై ప్రజల్ని చైతన్యవంతుడిని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఖండ ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు . రామకృష్ణ, , వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు

## మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించిన మంత్రి సీతక్క.

**ములుగు జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (నంది పత్రిక)** మారుమూల గ్రామాల్లో ఉండే నిరుపేద ప్రజలకు సేవ చేయాలని ఈ ప్రాంత సోదరులు తుమ్మ ప్రభాకర్ రెడ్డి తుమ్మ శ్రీధర్ రెడ్డి లు వారి తల్లి తండ్రి లు వారి కుమారుడి జ్ఞాపకార్థం ఈ ప్రాంతములో పేదలకు సేవ చేయాలని ఉద్దేశంతో ఈ లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని మంత్రి సీతక్క అన్నారు. అదివారం ఏటూరు నాగారం మండలం చిన్నబోయిన పల్లి గ్రామంలో కాలోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తుమ్మ ప్రభాకర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్ నుమంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన వారు గిట్టక తప్పదు కానీ మనం పుట్టిన ఊరికి ఈ ప్రాంతానికి ఏమీ చేశాం అనేది ముఖ్యమని మంత్రి సీతక్క అన్నారు.అనంతరం పాఠశాల లో ఉన్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్స్ తుమ్మ ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# కమలాపూర్ పేపర్ మిల్లును టేకోవర్ చేసిన వి యస్ టి జాడెక్కడ,





**ములుగు జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 ( నంది పత్రిక )**

మంగపేట మండల ఏఐటియుసి మహసభ గడ్డం భారతి అధ్యక్షతన కమలాపూర్ లో రావి నారాయణరెడ్డి భవణము లో ఏర్పాటు చేయగా హాజరైన ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ , ఏఐటియుసి జెండాను ఎగుం వేశారు. అనంతరం మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మంగపేట మండలంలో గల ఏకైక పరిశ్రమ( బి,జి, పి,పి,యల్) మూతపడి పదమూడు సంవత్సరాలు దాటినా పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు,కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన జిల్లా, మండల నాయకులు ఏం చేస్తున్నారు, ఎప్పుడు పునరుద్ధరిషస్తారు అని ప్రశ్నించారు, పాత కంపెనీని టేకోవర్ చేసిన వి, యస్, టి, యాజమాన్యం ఎక్కడా అని నిలదీసారు, కనుక ఈ ప్రాంతంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు,రాజకియ పార్టీలు పోరాడి సాదించుకోవాలని పిలుపునిచ్చారు దానితో పాటు దానిమీద ఆధారపడి అనేక బకాయిలు రావలసిన కార్మికుల బకాయిలు టేకోవర్ చేసిన యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దానితో పాటు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కేంద్ర ప్రభుత్వం కేవలం రూ 600/-మాత్రమె చెల్లస్తూ శ్రమ దోపిడీ చేస్తుందని, స్కీం వర్కర్స్ అందరినీ రెగ్యలరైజ్ చేయాలని, కార్మిక వర్గానికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని, భవణ నిర్మాణ సంక్షేమ బోర్డు ప్రభుత్వం ఆధీనంలోనే నిర్వహించాలని, సంక్షేమ బోర్డు నిధులను మెడికల్ టెస్టుల పేరుతోని దుర్వినియోగం చేయడం మానుకొని సభ్యులకు సంక్షేమ నిధులు పెంచాలని వారు డిమాండ్ చేశారు,,ఈ సమావేశంలో పాల్గొన్నవారు గడ్డం బండి జయమ్మ,మద్దిభోయున భారతి, యస్ కే షపియా, గడ్డం భారతి ఆలం హేమ,మ ఈసాల రమాదేవి, బల్లెం రాములు, కొడాలి తులసి,కె శ్రీదేవి,వాసం నాగేంద్ర,తాలూక వెంకటనర్సమ్మ ,విజయలక్ష్మి,కోరం పద్మ ,అమీన,పాగ పద్మ,ఖైరున్, బుచ్చమ్మ, అఖిల,, శ్రీలత,రేష నానమ్మ,, తదితరులు పాల్గొన్నారు

# మేడారం పనులను పరిశీలిస్తూ,వన దేవతలను దర్శించుకున్న మంత్రి





**ములుగు జిల్లా బ్యూరో అక్టోబర్ 12( నంది పత్రిక )**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తో దర్శించుకొని మొక్కులు చెల్లించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బిజెపి పార్టీలో పని కట్టుకొని విమర్శలు చేస్తోందని దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలుకు, మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా నిలబడుతుంది అని,సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శమని అన్నారు. మహిళా ప్రగతి అంటేనే సమాజ ప్రగతి అన్న మహనీయుడు అంబేద్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రతి మహిళా సంఘానికి వడ్డీలేని రుణాన్ని ఇచ్చి ప్రతి మహిళను కోటీశ్వరులను చేయడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి సీతక్క అన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకు సాగాలనిసూచించారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. నేను మంత్రి అయిన నాటి నుండి ఇప్పటి వరకు ములుగు నియోజక వర్గం లో సుమారు 30 కోట్ల సీడీఎఫ్ నిధులతో దళిత గిరిజన వాడల్లో సిసి రోడ్స్,డ్రైనేజీలు, కల్వర్టు లు మంజూరు చెయ్యడం జరిగిందని అదే విధంగా ములుగు నూతన బస్ స్టాండ్,ఏటూరు నాగారం లో బస్ డిపో కు నిధులు 80 కోట్ల రూపాయలతో టూరిజం డెవలప్మెంట్ పంచాయితీ రాజ్ శాఖ నుండి బిటి రోడ్లకు సుమారుగా 310 కోట్ల రూపాయలు కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని ఇలా అనేక రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అనినాయకులకు కార్యకర్తలకు మధ్యలో విభేదాలుంటే నా ద్రుష్టికి తీసుకురావాలిని సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉండాలి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మధ్యలోకి తీసుకెళ్లాలి మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి, గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి,కానీ ఎక్కడా మాట్లాడకూడదు పార్టీ కోసం పనిచేసిన వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీట్ చేయడం కోసం అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలి పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థలలో టికెట్లు ఇవ్వడం జరుగుతుంది అని రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. భూమి లేని రైతు కూలీలను అధ్వానంగా చూశారని, రూ.కోట్లు ఉన్న ఆసాములకు మాత్రం రైతు బంధు సాయం ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదల అభ్యున్నతికి దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఎన్నికలసందర్భంగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలుచేస్తుండటంతో బీఆర్ఎస్ నేతలకు కడుపు మంటగా ఉన్నట్లుందని మంత్రి సీతక్క అన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీ ఏర్పాటు... చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య

తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీ) హక్కుల సాధన ఉద్యమం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను సాధించడమే ఏకైక లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి 'తెలంగాణ బీసీ జేఏసీ' (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేశాయి. ఈ ఐక్య కార్యాచరణ కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నేత ఆర్. కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు కీలక సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు ఏ కారణంతో స్టే ఇచ్చిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఆయన పిలుపునిచ్చారు. "గత 76 ఏళ్లుగా బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పుడు దానికి అవమానం కూడా తోడైంది. మా హక్కుల కోసం చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టే వరకు ఈ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు" అని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. బీసీ సమాజం ఐక్యంగా నిలబడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి: రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. **పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. **హామీలన్నీ మోసమే...!** ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు.

# మేం ప్యాలెస్‌లు కట్టడానికి విశాఖ రాలేదు... మా లక్ష్యం అదే: మంత్రి నారా లోకేశ్

**విశాఖను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న లోకేశ్**

**రాష్టానికి రానున్న 10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో 50 శాతం విశాఖ రీజియన్‌కే**

**వచ్చే ఐదేళ్లలో నగరంలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పన**

**నవంబర్‌లో టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యకలాపాల ప్రారంభం**

**టీసీఎస్‌కు 99 పైసలకే భూమి కేటాయింపులో తప్పేంటి అని సూటి ప్రశ్న**

**నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు**

ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక చోదకశక్తిగా ఉన్న విశాఖపట్నాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి రానున్న రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనామిక్ రీజియన్‌కే వస్తున్నాయని, ఇది అభివృద్ధి పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని లోకేశ్ తెలిపారు. ఇప్పటికే నగరంలో సిఫీ ఆధ్వర్యంలో డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలంటే, అందులో విశాఖ రీజియన్ వాటా కనీసం ఒక ట్రిలియన్ డాలర్లు ఉండాలనే బృహత్తర లక్ష్యంతో పనిచేస్తున్నాం. మేము ప్యాలెస్‌లు కట్టడానికి విశాఖ రాలేదు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే పరిశ్రమలను తీసుకురావడానికే వచ్చాం" అని ఆయన వివరించారు. రాష్ట్రానికి రానున్న రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో రూ.5 లక్షల కోట్లు విశాఖ ప్రాంతానికే దక్కనున్నాయని, ఇది ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక దృష్టిని తెలియజేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విశాఖ రూపురేఖలు మార్చే అనేక కీలక ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయని లోకేశ్ వెల్లడించారు. నవంబర్‌లో టీసీఎస్ సంస్థ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, అదే నెలలో కాగ్నిజెంట్ సీఈవో విశాఖకు వచ్చి కొత్త ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. డిసెంబర్‌లో కాగ్నిజెంట్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ప్రారంభమవుతుందని చెప్పారు. వీటితో పాటు ఏఎన్ఎస్ఆర్ సత్వా, యాక్సెంచర్, గూగుల్, సిఫీ, ఆర్సెల్లర్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు ఫార్మా రంగంలో మరో ఐదు కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని అన్నారు. గూగుల్ పెట్టుబడులకు సంబంధించి త్వరలోనే ఢిల్లీలో ఒక పెద్ద ప్రకటన చేయనున్నట్లు సంకేతమిచ్చారు. ప్రతి పరిశ్రమను క్షేత్రస్థాయిలో నిలబెడతామని హామీ ఇచ్చారు. గ్రేటర్ విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్‌పై నాలుగు జిల్లాల కలెక్టర్లతో చర్చించామని, రోడ్లు, ప్రభుత్వ భూముల లభ్యత వంటి అంశాలపై సమీక్షించామని తెలిపారు. 'ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' అనే నినాదంతోనే తాము ప్రజల ముందుకు వచ్చామని, ప్రజలు 94 శాతం సీట్లతో తమను గెలిపించారని లోకేశ్ గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళతామని, రాబోయే ఐదేళ్లలో విశాఖలో ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. దీనికోసం సమగ్ర ప్రణాళికతో ముందుకెళుతున్నామని, నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలోనే సీఐఐ భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు.

# నన్ను క్షమించండి... వీడియో విడుదల చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్

కొన్ని రోజుల క్రితం తాను పెట్టిన పోస్టుల వల్ల చాలా మంది మనోభావాలు దెబ్బతిన్నాయని, అందుకు పూర్తి బాధ్యత వహిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అందరినీ తల వంచి క్షమించమని కోరుతున్నట్లు ఆ వీడియోలో శ్రీకాంత్ అయ్యంగార్ తెలిపారు. కాగా, కొద్ది రోజుల కిందట శ్రీకాంత్ అయ్యంగార్ గాంధీజీని ఉద్దేశించి సోషల్ మీడియాలో కొన్ని వివాదాస్పద పోస్టులు పెట్టారు. ఇవి క్షణాల్లో వైరల్ అవ్వడంతో నెటిజన్ల నుంచి, పలు వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఈ విషయంపై సీరియస్‌గా స్పందించారు. శనివారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆయన, ఆదివారం 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణుకు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే వారిని అయ్యంగార్ వ్యాఖ్యలు తీవ్రంగా గాయపరిచాయని బల్మూరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాజానికి తప్పుడు సంకేతాలు పంపేలా ప్రవర్తించిన శ్రీకాంత్ అయ్యంగార్ 'మా' సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసి, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పోలీసులకు, మరోవైపు 'మా'కు ఫిర్యాదులు అందడం, విమర్శలు తీవ్రతరం కావడంతోనే శ్రీకాంత్ అయ్యంగార్ దిగివచ్చి క్షమాపణ చెప్పినట్లు స్పష్టమవుతోంది.

# రామ్ చరణ్ ను అభినందించిన ప్రధాని మోదీ




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన అర్ధాంగి ఉపాసన కొణిదెల, మామగారు అనిల్ కామినేనితో కలిసి నిన్న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కావడం తెలిసిందే. ప్రపంచంలోనే మొట్టమొదటి ప్రొఫెషనల్ ఆర్చరీ (విలువిద్య) లీగ్ అయిన 'ఆర్చరీ ప్రీమియర్ లీగ్' (ఏపీఎల్) తొలి ఎడిషన్ విజయవంతం కావడంపై వారు ప్రధానితో చర్చించారు. దీనిపై ప్రధాని మోదీ నేడు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రామ్ చరణ్, ఉపాసన, అనిల్ కామినేని గారితో సమావేశం కావడం సంతోషంగా ఉంది. విలువిద్యను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి మీరు చేస్తున్న సమష్టి కృషి ప్రశంసనీయం. మీ ప్రయత్నాల వల్ల అసంఖ్యాక యువతకు మేలు జరుగుతుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సమావేశంపై రామ్ చరణ్ కూడా స్పందిస్తూ, ప్రధానిని కలవడం గౌరవంగా ఉందని తెలిపారు. "భారతీయ సంస్కృతిలో విలువిద్యకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ లీగ్ ద్వారా మన క్రీడాకారుల ప్రతిభను అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లాలన్నదే మా ఆకాంక్ష. దేశంలో అపారమైన ప్రతిభ ఉంది, ఏపీఎల్ వారికి సరైన వేదికను అందిస్తుంది" అని ఆయన అన్నారు. విలువిద్య వారసత్వాన్ని కాపాడటంలో ఇది తమ వంతు చిన్న ప్రయత్నమని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ఏపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న అనిల్ కామినేని నేతృత్వంలో ఈ లీగ్‌ను ప్రారంభించారు. ఔత్సాహిక క్రీడాకారులకు వృత్తిపరమైన శిక్షణ, అంతర్జాతీయ అవకాశాలు కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం.

# కోపంతోనే ఐఏఎస్ పదవికి రాజీనామా చేశా: మాజీ అధికారి ప్రవీణ్ ప్రకాశ్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఒకప్పుడు అత్యంత కీలక అధికారిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్ తన రాజీనామాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తీవ్రమైన కోపంతోనే తాను ఐఏఎస్ పదవికి రాజీనామా సమర్పించానని ఆయన బహిరంగంగా అంగీకరించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన పలు కీలక విషయాలను పంచుకున్నారు. గత ఏడాది కాలంగా తాను తీవ్రమైన ఒంటరితనం, తిరస్కరణ వంటి భావనలతో సతమతమయ్యానని ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. "వీఆర్ఎస్ తర్వాత విజయవాడలో ఇల్లు ఇవ్వడానికి కూడా ఎవరూ ఒప్పుకోలేదంట కదా?" అని అడిగిన ప్రశ్నకు, అది వాస్తవమేనని ఆయన అంగీకరించారు. తన సర్వీసులో ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకునేందుకు పలువురు సీనియర్ అధికారులను సంప్రదించానని ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడించారు. "నా బ్లైండ్ స్పాట్ ఏమిటి? నేను ఎక్కడ తప్పు చేశానో చెప్పండి" అని అడిగినా వారి నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని అన్నారు. ఇంటర్వ్యూలో భాగంగా "మీరు కోపంతోనే రాజీనామా ఇచ్చారు కదా?" అని నేరుగా ప్రశ్నించగా, "అవును, కోపంతోనే ఇచ్చాను" అని ప్రవీణ్ ప్రకాశ్ స్పష్టం చేశారు. అయితే, గతాన్ని వెనక్కి నెట్టి తాను ఇప్పుడు 'జర్నీ 2.0' ప్రారంభిస్తున్నానని ఆయన తెలిపారు. తన నిబద్ధత మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికేనని, రాష్ట్ర ప్రజలు అడిగే ప్రతి ప్రశ్నకు తాను సమాధానం చెబుతానని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికలు... ఎన్డీయే కూటమి సీట్ల పంపకం ఖరారు... ఎవరికి ఎన్ని సీట్లంటే...!

**బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్డీయేలో కొలిక్కివచ్చిన సీట్ల పంపకం**

**బీజేపీ, జేడీయూలకు సమానంగా చెరో 101 స్థానాలు**

**చిరాగ్ పాశ్వాన్ పార్టీకి 29 అసెంబ్లీ సీట్ల కేటాయింపు**

**మాంఝీ, కుష్వాహా పార్టీలకు చెరో ఆరు స్థానాలు**

**సామరస్యంగా ఒప్పందం కుదిరిందని నేతల ఉమ్మడి ప్రకటన**


**నితీశ్ కుమార్ నేతృత్వంలోనే ఎన్నికల బరిలోకి ఎన్డీయే కూటమి**

బీహార్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే)లో సీట్ల పంపకాలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. కూటమిలోని ప్రధాన భాగస్వాములైన బీజేపీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్-యునైటెడ్ (జేడీయూ) చెరో 101 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఆదివారం కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 సీట్లు ఉన్నాయి. మిగిలిన స్థానాలను ఇతర మిత్రపక్షాలకు కేటాయించారు. ఇందులో భాగంగా, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ-రామ్ విలాస్ (ఎల్‌జేపీ-ఆర్‌వీ)కు 29 సీట్లు దక్కాయి. అలాగే, జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం), ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) పార్టీలకు చెరో ఆరు స్థానాలు కేటాయించినట్లు ఎన్డీయే నేతలు వెల్లడించారు. పాట్నా, ఢిల్లీలలో సుదీర్ఘ చర్చల అనంతరం కుదిరిన ఈ ఒప్పందం వివరాలను ఎన్డీయే అగ్రనేతలు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఉమ్మడిగా ప్రకటించారు. బీహార్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. ఎంతో సామరస్య వాతావరణంలో సీట్ల పంపకాలు పూర్తయ్యాయని, కూటమి ఐక్యంగా ఎన్నికల బరిలోకి దిగుతోందని వారు తెలిపారు. ఈ ఒప్పందంపై మిత్రపక్షాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. "లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఒక సీటు ఇచ్చారు, ఇప్పుడు ఆరు సీట్లు కేటాయించడం సంతోషంగా ఉంది" అని జితన్ రామ్ మాంఝీ అన్నారు. మరోవైపు, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు స్థానాల్లోనూ గెలిచి సత్తా చాటిన చిరాగ్ పాశ్వాన్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 29 సీట్లు దక్కడం గమనార్హం. ఈ సీట్ల పంపకాలతో ఎన్డీయే కుటుంబం ఐక్యంగా ఉందని, నితీశ్ కుమార్ నేతృత్వంలో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చిరాగ్ పాశ్వాన్ ధీమా వ్యక్తం చేశారు. సీట్ల సర్దుబాటు పూర్తి కావడంతో, నితీశ్ కుమార్ నాయకత్వంలో బీహార్‌లో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి సమష్టిగా ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతోంది.



# సమాచార స్వేచ్ఛతోనే నిజమైన ప్రజాస్వామ్యం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 2005 సంవత్సరం ఒక మైలురాయి. ఆ ఏడాది అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిన సమాచార హక్కు (సహ) చట్టం దేశ పాలనను 'పారదర్శకత' వైపు మళ్లించింది. ఆర్టీఐ కేవలం ఒక పరిపాలనా చట్టం కాదు. పారదర్శకత, బాధ్యతాయుత పాలన, ప్రజా భాగస్వామ్యం అనే ప్రజాస్వామ్య మూలాలను బలపరిచే ఉద్యమంగా నిలిచింది. ఈ చట్టం ప్రజాస్వామ్యానికి నూతన శ్వాసనిచ్చిన సంస్కరణ. అధికారాల తలుపులు తెరిచి ప్రజల చేతుల్లో పౌరాధికారం పెట్టిన మానవ హక్కుల విప్లవం. ఇప్పుడు ఈ చట్టం ఇరవై ఏళ్లు పూర్తవుతున్న వేళ... దీని ప్రయాణం ఎలా ఉందో, ప్రపంచంలోని అత్యంత పారదర్శక దేశాలతో పోలిస్తే మనం ఎక్కడ ఉన్నామో పరిశీలించడం అవసరం. భారతదేశం ఆమోదించిన సహ చట్టం ప్రపంచంలో అత్యంత ప్రజానుకూలమైన చట్టాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది సమయపాలనతో సమాచారం ఇవ్వడం, ముందుగానే వివరాలు ప్రకటించడం, స్వతంత్ర సమాచార సంఘాలు ఏర్పాటు చేయడం వంటి ముఖ్య లక్షణాలను కలిగి ఉంది. ఇరవై ఏళ్లలో లక్షలాది పౌరులు ఈ చట్టం ద్వారా అవినీతిని వెలికితీశారు, సంక్షేమ పథకాలలో లోపాలను సరిచేశారు, ప్రభుత్వ బాధ్యతను పెంచారు. ప్రారంభ దశలో సహ చట్టం ప్రజల్లో ఆశను రగిలించింది. సాధారణ పౌరుడు కూడా ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించగలిగాడు. గ్రామ పంచాయతీ నుంచి కేంద్ర మంత్రిత్వ శాఖ వరకు, గ్రామ ప్రథమ పౌరుడు నుంచి దేశ ప్రధానమంత్రి వరకు 'ప్రజల సొత్తు' అనే అవగాహన వ్యాపించింది. కానీ రెండు దశాబ్దాల తర్వాత, ఆ కాంతి కొంత మందగించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార సంఘాల్లో నియామకాల ఆలస్యం, నిర్ణయాల తడబాటు, లక్షలాది కేసుల పెండింగ్ వంటివి చట్టం అమలుపై మబ్బుల్లా కమ్మాయి. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 4 లక్షలకు పైగా ఫిర్యాదులు పరిష్కారం కోసం రాష్ట్ర సమాచార కమిషన్ల వద్ద వేచి ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒక ఆర్టీఐ ఫిర్యాదు విచారణకు రావడానికి దశాబ్దాల సమయం పడుతోంది. తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే ఇప్పుడున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు దాదాపు 30 సంవత్సరాలు పడుతుందని 'సార్థక్ నాగరిక సంఘటన్' అనే స్వచ్ఛంద సంస్థ మూడు రోజుల క్రితం నివేదిక విడుదల చేసింది. సహ చట్టం అమలులో ప్రజలకు మద్దతుగా ఉండాల్సిన సమాచార కమిషన్ల బాధ్యతారాహిత్యానికి ఈ నివేదిక ఉదాహరణగా నిలుస్తోంది. చట్టం ఉన్నా, వ్యవస్థల్లో చలనం లేనట్లు సూచిస్తోంది. పౌరుడు అడిగే ప్రతి సమాచారానికి సమాధానమివ్వాలన్న బాధ్యత ప్రభుత్వానికి ఉన్నా, అది ఆచరణలోకి రాకపోవడం బాధాకరం. సమాచార హక్కు ఉద్యమం.. ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగం. యునెస్కో 2024 నివేదిక ప్రకారం, 139 దేశాలు ఇప్పటికే తమ రాజ్యాంగం లేదా చట్టాల ద్వారా ప్రజలకు సమాచారం పొందే హక్కు కల్పించాయి. స్వీడన్ 1766లోనే 'ఫ్రీడమ్ ఆఫ్ ది ప్రెస్ యాక్ట్' ద్వారా ప్రజలకు ప్రభుత్వ పత్రాలు పరిశీలించే హక్కు ఇచ్చింది. అమెరికా 1966లో 'ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ యాక్ట్' ద్వారా సమాచార నిరాకరణపై న్యాయ సమీక్షకు వీలు కల్పించింది. బ్రిటన్ (2000లో), మెక్సికో, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా వంటి దేశాలు అవినీతి నిరోధం, ప్రజా భాగస్వామ్యాన్ని బలపరచేందుకు ఇలాంటి చట్టాలు తీసుకువచ్చాయి. ముఖ్యంగా డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు సంవత్సరాలుగా 'అవినీతి లేని పరిపాలన', 'పౌరాభిప్రాయ బలమైన వ్యవస్థల'తో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. డెన్మార్క్‌లో ప్రభుత్వ నిర్ణయాలు పూర్తిగా బహిరంగంగా, అత్యంత పారదర్శకంగా ఉంటాయి. ప్రతి మంత్రిత్వ శాఖ తమ డేటా, ఖర్చులు, విధాన నిర్ణయాలకు సంబంధించిన సమస్త సమాచారం ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతుంది. ఫిన్లాండ్‌లో సమాచార హక్కు చట్టం అమలును రాజ్యాంగ ప్రమాణంగా పరిగణిస్తారు. న్యూజిలాండ్, సింగపూర్‌లో ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతుందిబీ విచారణల్లో ఆలస్యం ఉండదు. పాలనలో దాపరికానికి చోటులేదు అన్న భావన ఈ దేశాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వీరి విజయాలతో ఒక విషయం మనం గుర్తించాలి. పారదర్శకత అనేది కేవలం చట్టంతో కాదు, నిబద్ధతతో వస్తుంది. సమాచార హక్కు అమలు చేసే అధికారులు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. ప్రజల అభ్యర్థనలను ఆలస్యం లేకుండా పరిష్కరించగలిగే వ్యవస్థ నిర్మించాలి. భారతదేశం ఇప్పటికీ ప్రజాస్వామ్యంలో బలమైన మూలాలు కలిగిన దేశమే. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రధానమంత్రి నుంచి గ్రామ సర్పంచి వరకు ప్రజల ఎదుట బాధ్యత వహించే వ్యవస్థ ఏర్పడింది. అయితే ఈ వ్యవస్థ అమలులో కొన్ని లోపాలు ఉన్నాయి. సమాచార సంఘాల నియామకాలు ఆలస్యంబీ అప్పీలు, ఫిర్యాదులు సంవత్సరాల తరబడి పెండింగ్‌బీ కొన్ని విభాగాల్లో డేటా డిజిటల్‌గా అందుబాటులో లేకపోవడంబీ స్వచ్ఛందంగా ప్రకటించాల్సిన సమాచారాన్ని అందుబాటులో ఉంచకపోవడంబీ అధికారుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు లేకపోవడం వంటి లోటుపాట్లు... ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంగా పేర్కొనబడే ఆర్టీఐ చట్టాన్ని బలహీనపరుస్తున్నాయి. ఈ బలహీనతలను అధిగమిస్తే.. పారదర్శకత, అవినీతి రహిత పాలనలో భారతదేశం ప్రపంచ అత్యుత్తమ దేశాలలో ఒకటిగా నిలుస్తుంది. ఇరవై ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా, సమాచార హక్కు చట్టం భారత ప్రజాస్వామ్యంలో అత్యంత ధైర్యవంతమైన సంస్కరణగా నిలుస్తోంది. ప్రజా స్వామ్య భవిష్యత్తు కేవలం ఓటు హక్కులోనే కాదు, తెలుసుకునే హక్కులోనూ ఉంది. సమాచారం నిజంగా ప్రజలదైతే పాలన నిజమైన ప్రజాసేవగా మారుతుంది. అదే భారత ప్రజాస్వామ్యానికి శాశ్వత బలం. ఈ చట్టం భారత ప్రజాస్వామ్యానికి వెలుగు చూపిన దీపం. కానీ ఆ వెలుగును నిలబెట్టుకోవడం పౌరులుగా మన బాధ్యత. సమాచార స్వేచ్ఛ ఉన్న దేశమే నిజమైన ప్రజాస్వామ్యం కలిగిన దేశం. మన ప్రజాస్వామ్యం మరో రెండు దశాబ్దాలు మరింత బలంగా ఉండాలంటే 'సమాచారం ప్రజల హక్కు' అని ప్రతి పౌరుడూ భావించాలి.




# అది మా కుటుంబ సమస్య

**చిన్న చిన్న పంచాయితీలుంటాయి సీతక్క, సురేఖ నాతో మాట్లాడారు సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా పొంగులేటి వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంది అందుకే సుప్రీం తలుపు తడుతున్నాం ఆర్టీఐ చట్టానికి తూట్లు పొడిచిన బీజేపీ: మహేశ్‌గౌడ్ నేనెవరిపైనా ఫిర్యాదు చేయలే: సీతక్క అధిష్ఠానం మందలించలేదు: కొండా**

మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క మధ్య వివాదం తమ కుటుంబ సమస్య అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కుటుంబం అన్నప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య చిన్న చిన్న పంచాయితీలు ఉంటాయని, ఈ విషయంపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క తనతో మాట్లాడారని చెప్పారు. అయితే వారు ఫిర్యాదు చేసినట్లుగా కాకుండా.. అక్కడున్న సమాచారాన్ని మాత్రమే ఇచ్చారని తెలిపారు. దీనిపై తాను, సీఎం రేవంత్‌రెడ్డి కూర్చుని మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఉంటుందని, అధిష్ఠానానికి ఎవరైనా లేఖలు రాసే స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. సామాన్యుడి దగ్గర్నుంచి మంత్రుల వరకు ఎవరైనా వెళ్లి అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. ఇక స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని పీసీసీ చీఫ్ అన్నారు. అందుకే జీవో 9పై హైకోర్టు ఇచ్చిన స్టే మీద సుప్రీంకోర్టు తలుపు తడుతున్నామని చెప్పారు. ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలకు భయపడేది లేదని, బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నా.. నిర్వహించడం లేదని, బీసీలకు 42 శాతం రిజర్వేషనే తమకు ప్రాధాన్య అంశమని వెల్లడించారు. ఏడాది కిందట జరగాల్సిన ఎన్నికలను.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకే ఆపామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్.. బీసీ వ్యతిరేక పార్టీలు అని, బీసీల నోటికాడికి వచ్చిన కూడును కాలదన్నుతున్నాయని ఆరోపించారు.

**అడుగడుగునా అడ్డుకుంటున్న బీజేపీ.** బీసీ బిల్లులను బీజేపీ అడుగడుగునా అడ్డుకుంటోందని మహేశ్‌గౌడ్ అన్నారు. ఆ బిల్లులు రాష్ట్రపతి, గవర్నర్ వద్ద ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో బీజేపీకి చెందిన బీసీ ఎంపీలు ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ ఏనాడైనా అడిగారా? అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీసీ సంఘాల జేఏసీ నిర్వహించనున్న బంద్‌లో తాము కూడా పాల్గొంటామన్నారు. హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి కులవివక్ష కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారంటే.. సమాజం ఎటుపోతుందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ఐపీఎస్ కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. ఇక సమాచార హక్కు(ఆర్‌టీఐ) సహా.. యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన అనేక చారిత్రక చట్టాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. ఆర్టీఐ చట్టానికి 2019లో సవరణలు చేసిన బీజేపీ.. కమిషనర్ల స్వతంత్రతను బలహీనపరిచిందన్నారు. బీజేపీ ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చ్టేస వ్యక్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో మోసం

మెటా ఫండ్ ప్రో అనే క్రిప్టో కరెన్సీ స్కీమ్‌లో పెట్టుబడి పెడితే మూడింతలు లాభాలు వస్తాయని ప్రజలను మోసం చేసిన వ్యవహారాలు జగిత్యాలలో వెలుగులోకి వస్తున్నాయి. యేడాది క్రితం పలువురు వ్యక్తులు కీలకంగా వ్యవహరించి భారీగా పెట్టుబడులు పెట్టించారు. మెటా ఫండ్ ప్రో అనే యాప్‌లో పెట్టుబడి పెడితే మూడింతల లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేస్తున్న ఘటనలు ఒక్కొక్కటికి బయటకు వస్తున్నాయి. ఎక్కువ మందిని స్కీమ్‌లో జాయిన్ చేస్తే భారీగా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపి పెట్టుబడులు రాబట్టారు. ఈ వ్యవహారంలో జగిత్యాల, కొడిమ్యాల పోలీసులు ఇప్పటికే ముగ్గురు వ్యక్తులపై రెండు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసులో ఇంకా ఎవరెవరి పాత్ర ఎంత ఉందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**కొడిమ్యాలలో ఫిర్యాదుతో వెలుగులోకి..** కొడిమ్యాలకు చెందిన రాయనవేని వసంత, అడ్లగట్ట రమేశ్, బొల్లం రాకేశ్‌లతో మెటా మాస్క్ క్రిప్టో కరెన్సీ వ్యాలెట్ యాప్‌లో అదే గ్రామానికి చెందిన వీరబత్తిని రాజు, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, జగిత్యాలకు కస్తూరి రాకేశ్ కుమార్‌లు గత యేడాది రూ. 20.50 లక్షల పెట్టుబడిని పెట్టించారు. తమ పెట్టుబడులకు సంబంధించిన వివరాలపై ఇటీవల బాధితులు అడగ్గా కొన్ని రోజుల్లో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మిస్తూ దాటవేసి ధోరణితో వ్యవహరించారు. దీంతో అనుమానంతో రాయనవేని వసంత కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఈనెల 9న తిరుపతిరెడ్డి, రాజులను కొడిమ్యాల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు ఈనెల 10వ తేదీన జగిత్యాలకు చెందిన కస్తూరి రాకేశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో రాకేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి వద్ద ఒక ల్యాప్ టాప్, రూ.లక్ష నగదు, బ్యాంకు పాసుపుస్తకాలు, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం జగిత్యాల పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. జగిత్యాలకు చెందిన కస్తూరి రాకేశ్ యేడాది క్రితం తనను నమ్మించి ఓ యాప్‌లో పెట్టుబడి పెట్టించి రూ. 85 లక్షలు మోసం చేసినట్లు పట్టణానికి చెందిన ఫజిల్ హమ్మద్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆన్‌లైన్ దందాలో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.వంద కోట్ల పెట్టుబడులు రాబట్టినట్లుగా ప్రచారం జరుగుతోంది.

**మొదట్లో అధిక లాభాలు చూపించి మోసం..** యేడాది క్రితం జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో పేరేదైనా ఆన్‌లైన్ చైన్ దందాలన్నీ ఒకేలా పనిచేశాయి. మొదట్లో ఆకాశానికెత్తే లాభాలు చూపాయి. మెల్లగా చైన్ దందాలో ఇరికించాయి. ఇక 'నువ్వు కూడా ఓ పది మందిని జాయిన్ చేస్తేనే నీకు లాభాలు వస్తాయి..' అనే పరిస్థితిని తీసుకువచ్చాయి. అధిక లాభాలు వస్తాయన్న అత్యాశతో కొందరు మధ్య తరగతి ప్రజలు రూ.లక్షల్లో పెట్టారు. చిన్నపాటి కిరాణా దుకాణం నడిపే వారు సైతం అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. వీరితో పాటు పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పోలీసులు సైతం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. బంగారు ఆభరణాలు, కార్లు, ప్లాట్లు అమ్ముకొని లాభాలు వస్తాయన్న ఆశతో మధ్య తరగతి కుటుంబాల వారు ఆన్‌లైన్ దందాలో పెట్టుబడులు పెట్టారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వ్యవహారంలో యూబిట్ బిజినెస్‌లోని మెటా ఫండ్ వ్యాలెట్ యాప్ కారణమైంది. సమాజంలో వైట్ కాలర్‌గా గుర్తింపు ఉన్న పలువురు యూబిట్ దందాలో ఉండడమే జిల్లాలో వేగంగా విస్తరించడానికి కారణంగా మారిందన్న అభిప్రాయాలున్నాయి. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఈ దందాను ముందుగా జిల్లాకు తీసుకువచ్చారనే ప్రచారం ఉంది. జిల్లా కేంద్రంతో పాటు దరూర్, కోరుట్ల, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు కీలక వ్యక్తులు యూబిట్ దందాలో ప్రభావం చూపారని తెలుస్తోంది.

**విదేశీ టూర్ల పేరుతో..** ఆన్‌లైన్ వడ్డీ వ్యాపారంలో డాలర్ల రూపంలో పెట్టుబడి పెట్టించడానికి నిర్వాహకులు, ఏజెంట్లు విదేశీ టూర్ల పేరుతో పలువురిని ఆకర్షించారు. ఓ యాప్‌లో పెట్టుబడి లెక్కన దేశ విదేశాలకు టూర్లు ఆఫర్ ఇచ్చారు. రూ. 90 వేలు పెడితే గోవా, రూ. 5 లక్షలకు సింగాపూర్, రూ. 12 లక్షలకు యూరఫ్ దేశాలకు టూర్లు అంటూ వ్యాపారులు, యువతను ఆకర్షించారు. వందల సంఖ్యలో వ్యాపారులు, యువతను టూర్లకు తిప్పి పెట్టుబడులు పెట్టించినట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారాల్లో మనీ లాండరింగ్, హవాలా జరిగిందన్న అనుమానాలు సైతం పలువురు వ్యక్తం చేస్తున్నారు. కొందరు హైదరాబాద్‌తో పాటు విదేశాల్లో ఉంటూ క్రిప్టో కరెన్సీ పేరిట ఫేక్ యాప్ ద్వారా దందా చేసినట్లుగా ఆరోపిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ అంటూ వివిధ పేర్లతో గల యాప్‌ల ద్వారా దందాను గుట్టుగా సాగించారు. ఇందులో లాభాలు తొలుత అధికంగా కనిపించడంతో సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో జిల్లా పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాలో కీలకంగా వ్యవహరించిన రాకేశ్ విచారించిన పోలీసులు హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రధాన సూత్రదారి తీరును పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**–అశోక్ కుమార్, ఎస్పీ జిల్లాలో చైన్ సిస్టం, ఆన్‌లైన్ వ్యాపారాలు, యాప్‌లో పెట్టుబడుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి.

# వైద్యానికి శస్త్రచికిత్స

కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలల వ్యవహారాన్ని ప్రతిపక్షం అందిపుచ్చుకుంది. తాము ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా హడావిడి చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో కొంత తొందరపాటు ప్రదర్శించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుకావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు కారణాలను సహేతుకంగా వివరించకుండా హడావిడిగా నిర్ణయం తీసుకోవడంతో ప్రతిపక్షం చేతికి అస్త్రం లభించింది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం సరైనదా? కాదా? అన్నది ఇప్పుడు పరిశీలిద్దాం. వైద్య కళాశాలల అవసరం ఏ మేరకు ఉంది? ఇబ్బడిముబ్బడిగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకుంటూ పోతే ఫ్యాకల్టీ పరిస్థితి ఏమిటి? వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయమా? సంక్షేమం పేరిట బడ్జెట్‌లో సింహభాగం ఖర్చు చేస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి, నిర్వహించడం సాధ్యమా? ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు కళాశాలలు ఉన్నప్పటికీ ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల్లోనే చేరడానికి విద్యార్థులు ఎందుకు పోటీ పడుతున్నారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఎందుకు ఆకర్షితులవుతున్నారన్నది కూడా కీలక ప్రశ్నగా ఉంది. కాలమాన పరిస్థితులను బట్టి ఆలోచనలు, విధానాలు మారుతుంటాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగమే దిక్కుగా ఉండేది. అందుబాటులో ఉన్న పరిమిత వనరులతోనే దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పలు ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశారు. విద్యాసంస్థలను నెలకొల్పారు. ప్రభుత్వం వద్ద ఉన్న నిధులతోనే నీటి ప్రాజెక్టులను కూడా దశలవారీగా నిర్మించారు. పంచవర్ష ప్రణాళికలను రచించుకొని అమలు చేశారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ కూడా దాదాపుగా ఇవే విధానాలను కొనసాగిస్తూ సంక్షేమంపై కూడా దృష్టి పెట్టారు. రాజభరణాలు రద్దు చేయడంతో పాటు ప్రైవేటు రంగంలో ఉన్న బ్యాంకులను జాతీయం చేశారు. ఇందిరాగాంధీ తదనంతరం ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మారాయి. రక్షిత ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ రంగం అన్న వాదనకు కాలం చెల్లింది. పోటీతత్వం పెరగడంతో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు బ్యాంకులను జాతీయం చేయగా, ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహించే పరిస్థితి! అదే సమయంలో ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించింది. నెహ్రూ హయాంలో హైదరాబాద్‌లోని బాలానగర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ సంస్థ (ఐడీపీఎల్) ఏర్పాటైంది. ప్రస్తుత ఫార్మా దిగ్గజాలైన మురళి, డాక్టర్ అంజిరెడ్డి, పార్థసారథి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి వంటి వారందరూ అందులో పనిచేసినవారే. ఐడీపీఎల్‌లో తమ పరిస్థితి ఎదుగూబొదుగూ లేకుండా ఉండటంతో అందులో పనిచేసిన పలువురు బయటకు వచ్చి సొంతంగా ఫార్మా కంపెనీలను ప్రారంభించి ఇవాళ కుబేరుల జాబితాలో చేరారు. ఐడీపీఎల్ మాత్రం చాలాకాలం క్రితమే మూతపడింది. ప్రభుత్వ రంగం అని పట్టుకొని వేళాడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ సంస్థే నిదర్శనం. టెలికమ్యూనికేషన్ రంగాన్నే తీసుకుందాం. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండేది. అప్పుడు టెలిఫోన్ కనెక్షన్ కోసం నెలలు, సంవత్సరాలు వేచి చూడవలసి వచ్చేది. ఈ రంగంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించడంతో పరిస్థితిలో ఎంత వేగవంతమైన మార్పు వచ్చిందో చూస్తున్నాం. ఫోన్ కనెక్షన్ల కోసం మన చుట్టూ తిరుగుతున్నారు. ఏ రంగంలోనైనా మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు వ్యతిరేకత రావడం సహజం. మార్పు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తే అర్థం చేసుకుంటారు. టెలికమ్యూనికేషన్ రంగాన్ని ప్రైవేటుపరం చేసినప్పుడు కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ రంగంలో బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండాలని పట్టుబట్టాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నాటి మార్పును వ్యతిరేకించిన కమ్యూనిస్టు పార్టీలే దేశంలో బలహీనపడ్డాయి. ప్రైవేటు రంగంలోని టెలికాం కంపెనీలు దూసుకుపోతున్నాయి. ప్రజలకు కూడా సౌకర్యాలు మెరుగయ్యాయి. గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఉత్సుకత చూపిస్తున్నారు. ఇవాళ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉంటాయి. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. అయినా ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడానికి కారణం ఏమిటి? ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించడం ప్రధాన కారణం. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడమే సరైన నిర్ణయం. మారిన పరిస్థితులలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసి వచ్చింది. ఇప్పటి పరిస్థితులకు పబ్లిక్%–%ప్రైవేటు భాగస్వామ్యమే సరైనది. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ పేరిట నెహ్రూ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను విక్రయిస్తున్నది. దీన్ని విమర్శించే వారు ఉన్నప్పటికీ ప్రజలు పట్టించుకోవడం లేదు. ఈ నిర్ణయం ప్రభావం రాజకీయాలపై కూడా కనబడటం లేదు.

**కాలంతో మారాల్సిందే!** మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం శక్తికి మించి అప్పులు చేసి అయినా ఖర్చు చేయడానికి ప్రజలు కూడా సిద్ధపడుతున్నారు. ప్రపంచీకరణ కారణంగా పోటీతత్వం పెరిగింది. ప్రభుత్వ రంగమైనా, ప్రైవేటు రంగమైనా పోటీ పడక తప్పని పరిస్థితి. పోటీ పడలేని ప్రైవేటు సంస్థలు కూడా కనుమరుగవుతున్నాయి. బూజు పట్టిన సిద్ధాంతాలు, కాలం చెల్లిన విధానాలకు ఇప్పుడు చోటు లేదు. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడాల్సిందే. విశ్వవిద్యాలయాలనే తీసుకుందాం. ఒకప్పుడు ఉస్మానియా, ఆంధ్రా యూనివర్సిటీలకు ఎంతో పేరుండేది. కాలక్రమేణా అవి తమ ప్రతిష్ఠను కోల్పోయాయి. ప్రైవేటు రంగంలో ఏర్పాటైన యూనివర్సిటీలతో పోటీ పడలేక సతమతమవుతున్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో పలు ప్రైవేటు ఆస్పత్రులను విజయవంతంగా నిర్వహిస్తున్న డాక్టర్లు ఒకప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్‌లో పనిచేసినవారే. అక్కడ తమకు ఎదుగూబొదుగూ ఉండదని భావించి బయటకు వెళ్లిపోయి సొంత ఆస్పత్రులు ఏర్పాటుచేసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పేరొందిన పలు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఒకప్పుడు ప్రజలకు అవే దిక్కుగా ఉండేవి. ప్రజలకు కూడా వాటిపై విశ్వాసం ఉండేది. కాలక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతూ వచ్చింది. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు..' అని సినిమా పాటలు కూడా వచ్చాయి అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పేదలు కూడా తమ శక్తికి మించినదైనా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. అలా అని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంచి వైద్యులు ఉండటం లేదా? సౌకర్యాలు సరిగా లేవా? అంటే అదేమీ కాదు. సిబ్బందిలో జవాబుదారీతనం లోపించడమే ప్రధాన కారణం. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం ఎందుకు కల్పించలేకపోతున్నాయో ఆత్మపరిశీలన అవసరం. వైద్య విద్య విషయమే తీసుకుందాం. తెలుగునాట ఇటీవలి కాలంలో ప్రైవేటు రంగంలో పలు వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ఇందులో కొన్ని గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటయ్యాయి. అయితే మిగతా రంగాలలో వలె కాకుండా వైద్య రంగంలో ప్రైవేటు వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోని కళాశాలలతో పోటీ పడలేకపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రైవేటు కళాశాలలలో చేరడానికి వైద్య విద్యార్థులు ఇష్టపడటం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఆయా కళాశాలల్లో ఫ్యాకల్టీ సరిగా లేకపోవడమే. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య కళాశాలలు అన్నీ ప్రధాన పట్టణాలు, నగరాలలోనే ఉన్నాయి. ఈ కారణంగా ఆ కళాశాలలకు ఫ్యాకల్టీ ఇబ్బంది రాలేదు. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GSTIN 37AMRPM5719R1ZX EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id:nandipatrika@gmail.com